www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 122 బుధవారం, సెప్టెంబర్ 16, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

**సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించండి**

**టూరిజం, ఎడ్యుకేషన్ రంగాల్లో సహకరించండి : ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం**

**తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీ మ్ ఆగా ఖాన్–5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, మిగతా2లో...




# బాదుడే!

**నాడు జీఎస్టీ.. నేడు యూపీఐ**

**రూ. 2వేలు దాటితే**

**యూపీఐ లావాదేవీలపై త్వరలో**

**చార్జీల వసూలుకు కేంద్రం సన్నద్ధం**

**బ్యాంకర్లతో కమిటీ ఏర్పాటు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 15 :** దేశ వ్యాప్తంగా ఏటికేడాది పెరుగుతున్న యూపీఐ చెల్లింపుల వల్ల వీసా, మాస్టర్ కార్డ్ వంటి అమెరికా ఉత్పత్తులకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 2 వేలకు పైగా విలువైన యూపీఐ చెల్లింపులకు ఛార్జీలను వర్తింపచేయా లని నిర్ణయించింది. అయితే 2 వేలు దాటిన లావాదేవీలపై

మిగతా2లో...



# మాజీ మంత్రి 'ఆళ్ల నాని' మృతి

**- గుండెపోటుతో విశాఖలో కన్నుమూత**

**ఏలూరు,సెప్టెంబర్ 15 :** మాజీ మంత్రి 'ఆళ్ల నాని' గుండెపోటుతో కన్నుమూసారు. జగన్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆళ్ల నాని, తొలుత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా.. ఆ తర్వాత వైఎస్ జగన్ హయాంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా సేవలు అందించారు. వైఎస్‌రాజశేఖరరెడ్డి హాయాంలో మిగతా2లో...

# రాణాలో దాడిపై విచారణ జరిపించండి

● పూర్తి సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేసి బాధ్యులపై కేసులు నమోదు చేయాలి ● బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ● కేటీఆర్ పీఏ, పీఆర్వోలపై దాడియత్నంపై ఖండన



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌పై ము సుగులు ధరించిన వ్యక్తులు సోమవారం దాడికి యత్నించిన ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విచారణ పేరుతో పండుగ రోజున పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, సు మారు 15మంది ముసుగులు ధరించిన పోలీసులు ఇంటరాగేషన్ రూమ్‌లోకి వెళ్లి దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. మిగతా2లో...

# 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

**- ఇది భూభారతి కాదు...భూహారతి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**- 30 శాతం కమీషన్ల ప్రయత్నాలను మానుకోవాలి కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లను బేషరతుగా తొలగించాలి ఇది భూభారతి కాదు... భూహారతి : కేటీఆర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** 22ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారనీ, 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న ఈ ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్ మిగతా2లో...



# నిందితులను నేరుగా అరెస్టు చేయొద్దు.. చట్టప్రకారమే దర్యాప్తు జరుపాలి

**- ఎర్రవల్లి రోడ్డు శుద్ధి కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం**

# 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

**అసెంబ్లీలో ప్రసంగించనున్న రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్ 15 :** అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసా గుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హె చ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి మిగతా2లో...

# అంతర్రాష్ట్ర బస్సుల కోసం బస్ టెర్మినల్స్.. :పొన్నం



2లో





# శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాల సమర్పణ

**- రేపు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం**

**అమరావతి,సెప్టెంబర్ 15 :** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా

మిగతా2లో...

# గణనాథుడికి కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 15 :** వినాయక చవితి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రవెల్లి నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కేసీఆర్, సతీమణి శోభ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ కుమారుడు హిమాన్షు కూడా హాజరయ్యారు.

మిగతా2లో...

## 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

**(మొదటి పేజీ తరువాయి)**

సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా?అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు అదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు.

## శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాల సమర్పణ

**(మొదటి పేజీ తరువాయి)**

ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు సాయంత్రం 6.20 గంటలకు శ్రీ గాయత్రీ నిలయానికి చేరుకుంటారు. రాత్రి 7.40 గంటలకు బేడి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అనంతరం రాత్రి 7.55 గంటల నుంచి 9.15 గంటల వరకు వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, స్వామి వారిని దర్శించుకుంటారు. దర్శనం అనంతరం గాయత్రీ నిలయానికి చేరుకుని రాత్రి బస చేస్తారు. **తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం** బుధవారం ఉదయం 8.40 గంటలకు వీఐపీ క్యూ కాంప్లెక్స్-1లోని 17వ కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన యాత్రికుల అనుభవ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 9.15 గంటలకు గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తారు. 9.35 గంటలకు ఎస్వీ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. అధికారులతో సమావేశమవుతారు. తిరుమలలో కార్యక్రమాలను ముగించుకుని బుధవారం మధ్యాహ్నం 02.00 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

**(మొదటి పేజీ తరువాయి)**

అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. **మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి** మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. **ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 ఆసక్తి** 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందు కోసం సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్-జీరో సిటీగా ఏర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం వెల్లడించారు. **2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం** 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దాన్ని 10 శాతానికి పెంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. సమ్మిట్‌కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 సీఎం ఆహ్వానించారు. సమ్మిట్‌లో 100కు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, వ్యాపార అవకాశాల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని సీఎం వివరించారు. **విద్యా, పర్యాటక రంగాల్లో సహకారంపై చర్చ** ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడా నికి అంగీకరించాయని ఆయన తెలిపారు. మరోవైపు, ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆమె కోరారు.

## 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి

**(మొదటి పేజీ తరువాయి)**

మీడియాతో మాట్లాడారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామనీ, రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని అన్నారు. "తప్పు చేసింది అధికారులు కాదనీ ప్రభుత్వమేనని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. ప్రజలు కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి, బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి రక్షణ కవచంధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ అన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు. ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనీ, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ఇది భూభారతి కాదనీ, భూ హారతి అని విమర్శించారు. అన్ని అడ్డగోలు చర్యలను నిలిపేసి, ప్రజల యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు. అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలిఅసైన్డ్ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయని చెప్పారు. రెండేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందనీ, తప్పు చేసిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ప్రధాన ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపారుప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను అంటగట్టి, సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమను సస్పెండ్ చేసిందన్నారు. సస్పెండ్ చేసినప్పటికీ తాము ప్రజల్లోనే ఉన్నామని చెప్పారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటామన్నారు. తప్పు చేసింది ప్రభుత్వం శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు. పోలీసులపై నమ్మకం లేదు.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాంప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని విమర్శించారు. పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నామని చెప్పారు. న్యాయస్థానంలో తప్పకుండా న్యాయం దొరుకుతుందని ఆశిస్తున్నామని అన్నారు.

## చైనాలో 2027 బ్రిక్స్ సదస్సు : జిన్‌పింగ్



**న్యూఢిల్లీ :సెప్టెంబర్ 15 :**
వచ్చే సంవత్సరం జరిగే బ్రిక్స్ సదస్సుకు తాము ఆతిథ్యం ఇస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో జిన్‌పింగ్ ప్రసంగించిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జరిగే సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నందుకు ఆయనను అభినందించారు. జిన్‌పింగ్ ప్రకటనను చైనా అధికార వార్తా సంస్థ సిన్హువా, భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం ధృవీకరించాయి. అయితే సదస్సును ఎక్కడ, ఎప్పుడు నిర్వహిస్తారనే వివరాలు తెలియలేదు.

## బాదుడే!

**(మొదటి పేజీ తరువాయి)**

ఛార్జీలు విధించాలన్న నిర్ణయంపై విపక్షాలతో పాటు సాధారణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో కేంద్రం ఇవాళ మరో కీలక ప్రకటన చేసింది. 2 వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలు విధిస్తామని, అయితే ఈ ఛార్జీల్ని వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదని, వ్యాపారులే చెల్లిస్తారని కూడా కేంద్రం వెల్లడించింది. వినియోగదారులకు ప్రస్తుతం ఉన్న విధంగానే యూపీఐ సేవలు ఉచితంగానే అందుబాటులో ఉంటాయని 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' స్పష్టం చేసింది. సవరించిన యూపీఐ మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానం అక్టోబర్ 15 నుండి అమల్లోకి రానుందని కూడా ప్రకటించింది. కేంద్రం వాదన ఎలా ఉన్నా.. యూపీఐ చెల్లింపులు చేసేటప్పుడు అవి 2 వేలు మించితే వ్యాపారులపై భారం పడినా, వారు తిరిగి వినియోగదారులపైనే దాన్ని మోపుతారు. ఇదే అంశాన్ని విపక్షాలు పదే పదే ప్రస్తావిస్తున్నా కేంద్రం మాత్రం నేరుగా భారం పడటం లేదని వాదిస్తోంది. ఇప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఎన్సీపీఐ కూడా వినియోగదారులపై ఎలాంటి భారం పడదని చెబుతోంది. కానీ వ్యాపారులు తమపై పడే చిన్న భారాన్ని కూడా వినియోగదారులపై బదిలీ చేయడం మొదలుపెడితే యూపీఐ లావాదేవీలు నెమ్మదించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## మాజీ మంత్రి 'ఆళ్ల నాని' మృతి

**(మొదటి పేజీ తరువాయి)**

యువజన కాంగ్రెస్ నాయకునిగా కొనసాగిన నాని మూడు సార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి అనంతరం పార్టీకి దూరంగా ఉంటూ వచ్చిన ఆయన ఇటీవలే టీడీపీలో చేరారు. ఆళ్ల నాని మృతితో ఏలూరులో విషాదం నెలకొంది. నాని పార్థీవదేహాన్ని విశాఖపట్నం నుండి ఏలూరు తీసుకొచ్చి ఏలూరులో అంత్యక్రియలు జరపనున్నారు.

## అంతర్రాష్ట్ర బస్సుల కోసం బస్ టెర్మినల్స్..: పొన్నం

**హైదరాబాద్,సెప్టెంబర్ 15 :** కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతోపాటు ఔటర్‌రింగ్ రోడ్డు వైపు నుంచి వచ్చే బస్సులను నగరంలోకి రాకుండా టెర్మినల్స్ వరకే నడిచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయం వైపు వెళ్లే బస్సులు, నగరానికి వచ్చే అంతర్ జిల్లా బస్సులు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్దే నిలిపి, అకడి నుంచి ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. దీంతో నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉన్నదని తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై దృష్టి సారించామని వెల్లడించారు. ఆయా టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. **కుట్టుమిషన్ల దరఖాస్తు గడువు 30కు పొడిగింపు** బీసీ సంక్షేమశాఖ బీసీ మహిళల కోసం కుట్టుమిషన్ల పంపిణీ పథకానికి సంబంధించిన దరఖాస్తుల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల మంది మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్టు తెలిపారు. 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు కుట్టుమిషన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3.50 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నట్టు బీసీ సంక్షేమశాఖ వర్గాలు వెల్లడించాయి.

## గణనాధుడికి కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు

**(మొదటి పేజీ తరువాయి)**

తాత, నానమ్మతో కలిసి అతడు కూడా పూజలో పాల్గొన్నారుబీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీ సమేతంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రవెల్లి నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కేసీఆర్, సతీమణి శోభ పాల్గొన్నారు. మట్టి వినాయకుడికి పూజలు చేసి.. తెలంగాణ ప్రజానీకం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ కుమారుడు హిమాన్షు కూడా హాజరయ్యారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి, విజయాలను అందించే దైవంగా, వినాయకుణ్ణి హిందూ సమాజం కొలుచుకుంటుందని అన్నారు. దైవ పూజలను, ధార్మిక క్రతువులు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాయకునికి తొలి ప్రాధాన్యతనిస్తామని కేసీఆర్ తెలిపారు. వాడ వాడలా మండపాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు గణేశ్ నవరాత్రులు జరుపుకుంటూ, పిల్లలు పెద్దలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం తిరిగి గాడినపడి, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ, ఏకదంతుడిని కేసీఆర్ ప్రార్థించారు.

## రాణాలో దాడిపై విచారణ జరిపించండి

**(మొదటి పేజీ తరువాయి)**

లీగల్ టీమ్ అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారని తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేసి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## నిందితులను నేరుగా అరెస్టు చేయొద్దు.. చట్టప్రకారమే దర్యాప్తు జరుపాలి

**- ఎర్రవల్లి రోడ్డు శుద్ధి కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం**



**హైదరాబాద్,సెప్టెంబర్ 15 :**
సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసం వద్ద రోడ్డును పసుపునీటితో శుద్ధి చేశారంటూ నమోదైన కేసులో నిందితులను నేరుగా అరెస్టు చేయరాదని హైకోర్టు ఆదేశించింది. నిందితులకు నోటీసులు జారీచేసి చట్టప్రకారం ఈ కేసు దర్యాప్తు జరుపాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ కేసులో తమను అక్రమంగా అరెస్టు చేసే అవకాశం ఉన్నదన్న అనుమానంతో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు వేర్వేరుగా 3 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేయడంతో జస్టిస్ టీ మాధవీదేవి మంగళవారం పై ఆదేశాలు జారీచేశారు.

# చినుకు పడితే చిత్తడే..
# పారిశుద్ధ్యం పడకేసింది!

●లక్ష్మీదేవిపేట--నర్సింగాపూర్ తండా రోడ్డు అధ్వానం

●నీరు నిలిచి దోమలు, ఈగల స్వైర విహారం..

శానిటేషన్‌పై సర్పంచ్, కార్యదర్శికి చిత్తశుద్ధి లేదా?







**లక్ష్మీదేవిపేట, ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 14 ( పీపుల్స్ న్యూస్)** చినుకు పడితే చాలు.. రోడ్డు కనిపించదు.. చిత్తడే కనిపిస్తుంది! లక్ష్మీదేవిపేట--నర్సింగాపూర్ తండా రహదారి దుస్థితి చూస్తే గ్రామీణ పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. రహదారిపై వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దోమలు, ఈగలు ముసురుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంత దారుణమైన పరిస్థితుల్లోనూ పారిశుద్ధ్య చర్యలు ఎక్కడ? ఇప్పటివరకు కనీసం ఒక్క రోజైనా శానిటేషన్, పారిశుద్ధ్య పనులు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన గ్రామపంచాయతీ యంత్రాం గం ఏం చేస్తోందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.సమస్యను ఎన్నిసార్లు సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడు తున్నారు. ప్రజలు చెప్పినా వినరా? సమస్య కనిపించినా కనిపించనట్టేనా? వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి దోమలు పెరుగుతున్న విషయం అధికారుల దృష్టికి రాలేదా? లేక పట్టించుకోవాలనే ఆసక్తి లేదా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఎందుకు? గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత ఉన్న సర్పంచ్, కార్యదర్శి కనీస చర్యలు తీసుకోకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, నిలిచిన నీటిని తొలగించి వెంటనే పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇకనైనా గ్రామపం చాయతీపాలకవర్గం మేల్కొంటుందా?లేక మరో వర్షం వచ్చే వరకు ప్రజలను ఇదే చిత్తడిలో వదిలేస్తారా? అని స్థానికులు నిలదీస్తున్నారు.

## భూపాల పల్లి నూతన సిఐ చెన్నూరి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన

**వెంకటాపూర్ రామప్ప మండలం బారాస పార్టీ అధ్యక్షులు లింగాల రమణారెడ్డి**



**భూపాలపల్లి జిల్లా ప్రతినిధి 15(పీపుల్స్ న్యూస్)** భూపాల్ పల్లి నూతన సిఐగా వచ్చిన చెన్నూరి శ్రీనివాస్ గతంలో వెంకటాపూర్ సబ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహించడం జరిగింది. సీఐగా ప్రమోషన్ పొందినందుకు చెన్నూరి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన రమణారెడ్డి. ఈ కార్యక్రమంలో నారాయణపూర్ మాజీ సర్పంచ్ భాష వేణి జ్ఞానేందర్ తీగల యుగేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 21 నుండి వారాంతపు సంత ప్రారంభం




**(వెంకటాపూర్) ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**
వెంకటాపూర్ మండల కేంద్రం లో ని గ్రామ పంచాయతీ దగ్గర లో ప్రతి సోమవారం కూరగాయల వారాంతపు సంత జరుగుతుందని గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ అన్నారు.మండల పరిధి లోని రైతులు, వ్యాపారులు, కూరగాయలు,పండ్లు, బట్టలు తీసుకు వచ్చి క్రయ ,వి క్రయాలను చేసుకోవచ్చని సూచించారు. అనంతరం సర్పంచ్ సుగుణ వారాంతపు సంత అంగడి కరపత్రాలను గ్రామస్తుల అందరి తో కలిసి ఆవిష్కరించి, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అన్నవేన రాజు,జిల్లా కాంగ్రెస్ నాయకులు మిలుకురి ఐలయ్య,యన్ యస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిడి శెట్టి కోటి,మండల నాయకులు చెన్నోజు శ్రీను,జంగిలి రవి,గ్రామ కమిటీ అధ్యక్షుడు యస్ కె జాకీర్ ,బి.ఆర్ యస్ నాయకులు పోశాల విరమల్లు,గ్రామస్థులు గంగుల రాజుకుమార్ ,ల్యాగల రాజు ,మాదాసు అజయ్ ,మొగిలి ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆది పూజ్యుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలి.

**--బాలిని వీణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం..**



**(వెంకటాపూర్) ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**
ఆది పూజ్యుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని బొడ్రాయి యూత్ అధ్యక్షుడు అక్క పెల్లి శివ శంకర్ ఆకాంక్షించారు. బొడ్రాయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహ దాత క్యాతం రుచిత ప్రవీణ్ ఏర్పాటు చేసిన గణనాథుడి పూజా కార్యక్రమానికి శివశంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసం తోషాలతో ఉండాలని కోరుకున్నారు.వినాయక చవితి సందర్భ ంగా బొడ్రాయి యూత్ అసోసియేషన్ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొ న్నారు.యువత ఐక్యతతో గ్రామంలో ఆధ్యాత్మిక,సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. మంగళవారం బాలిని వీణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. యూత్ అసోసియేషన్ సభ్యులు పల్నాటి కోటయ్య,చీకుర్తి రమేష్, చింతి రెడ్డి రమణారెడ్డి, అక్కపెల్లి గోపాల్, హరీష్, శ్రీనివాస్, అక్కినేపల్లి శ్రీనివాస్, లోటపేటల రాజేష్, పేర్ల రాకేష్, రుద్రోజు రమేష్, మోడం శ్రీనివాస్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కత్తితో బెదిరించి రూ.20 వేల డిమాండ్.. రౌడీషీటర్ అరెస్ట్




**- నిందితుడి వద్ద నాలుగు కత్తులు, మొబైల్ ఫోన్ స్వాధీనం**

**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**
అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన కేసులో రౌడీషీటర్ సయ్యద్ మహమ్మద్ అలియాస్ చంగో (25)ను అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు కత్తులు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 4న రాత్రి సుమారు 8 గంటల సమయంలో నిందితుడు అత్తాపూర్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో నివసించే నూర్ జహాన్ బేగం ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. ఆమె కుమారుడు అబ్దుల్ రెహమాన్ గొంతుపై కత్తి పెట్టి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు.తన కుమారుడిని రక్షించేందుకు నూర్ జహాన్ బేగం ప్రయత్నించగా, ఆమెను కూడా కత్తితో బెదిరించి దుర్భాషలాడుతూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఘటన సమయంలో అక్కడికి చేరుకున్న ప్రత్యక్ష సాక్షులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై బాధితురాలు సెప్టెంబర్ 13న అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో క్రైమ్ నంబర్ 997/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదైన 12 గంటల్లోనే ప్రత్యేక బృందాలు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.సయ్యద్ మహమ్మద్ అలియాస్ చంగో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్నాడని, గతంలో ఆస్తి సంబంధిత, శారీరక దాడి, ఎన్డీపీఎస్ తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్ట్ అనంతరం నిం దితుడిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.కేసు దర్యాప్తును అత్తా పూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ. సీతయ్య, ఎస్ఐ నిరంజన్ మహమ్మద్ హుస్సేన్ పర్యవేక్షిస్తున్నారు.

## మట్టి విగ్రహాన్ని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

●గ్రామ పంచాయతీ ఆవరణం లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

●గ్రామ పంచాయతీ పాలకవర్గం తో కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన బొమ్మకంటి వంశావతి రమేష్





**లక్ష్మీదేవిపేట ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (పీపుల్స్ ం**
వెంకటాపూర్ మండలం లోని లక్ష్మీదేవిపేట గ్రామ పంచాయతీ లో ఆవరణం లో వినాయక చవితి వేడుకల్లో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ ఈ సందర్భంగా సర్పంచ్ వంశావతి రమేష్ లు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించి, గ్రామ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని గణనాథుడిని ప్రార్థించారు.వినాయక చవితి పర్వదినాన్ని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ తిరుపతి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గాజవేని రమేష్ మాజీ సర్పంచ్ గాజర్ల సరోజన చిర్ర వీరస్వామి గాజర్ల చరణ్ వార్డు సభ్యులు తో పాటు గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు

## రెండేళ్ల పీసీసీ ప్రయాణం సంతృప్తికరం

- గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత అందుబాటులో
- పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్





**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ సెప్టెంబర్ 15 :** పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో సంతృప్తికరంగా సాగిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయగలిగామని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి గాంధీ భవన్‌లో బొమ్మా మహేష్ కుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ,, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేశామని తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించామని, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంలో ముందుకు సాగామని చెప్పారు. గత రెండేళ్ల కాలం సజావుగా సాగేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్న సమన్వయం ఎంతో దోహదపడిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నుంచి తనకు సంపూర్ణ సహకారం లభించిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీ భవన్‌ను కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంత్రులను గాంధీ భవన్‌కు ఆహ్వానించి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గాంధీ భవన్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించడం పీసీసీ అధ్యక్షుడిగా తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,, పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసిన బొమ్మా మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# గురుకుల పాఠశాలలో కుళ్ళిన కూరగాయలతో వంటలు

- ప్రశ్నించిన పేరెంట్స్ లోపి కమిటీపై మెస్ ఇన్‌ఛార్జ్, ప్రిన్సిపాల్ దుర్భాషలు
- అధికారుల సస్పెన్షన్‌కు డిమాండ్.













**మల్లంపల్లి(ములుగు) సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)** మల్లంపల్లి లోని ఏటూరునాగారం టీ జీ ఎస్ డబ్ల్యు ఆర్ ఎస్ జూనియర్ కాలేజ్ (బాలుర) ( మల్లంపల్లి) గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కుళ్ళిపోయిన కూరగాయలతో భోజనం పెడుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పాఠశాల పేరెంట్స్ కమిటీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం రోజున పేరెంట్స్ కమిటీ చైర్మన్ అర్షం రాజ్ కుమార్ పాఠశాలలోని వంటగదిని, మెస్ రూమ్‌ను సడన్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో తీవ్రమైన నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. కుళ్ళిన కూరగాయలతో వంటలు: మెస్ రూమ్‌లో పూర్తిగా కుళ్ళిపోయిన క్యాబేజీ, చిక్కుడుకాయలు, టమాటాలు లభించాయి. అంతటి నిరుపయోగమైన చిక్కుడుకాయలను విద్యార్థుల చేతే పొట్టు తీయిస్తూ, అవే కూరగాయలతో వంటలు చేస్తుండటాన్ని కమిటీ చైర్మన్ ప్రత్యక్షంగా చూసి షాక్ అయ్యారు. సిబ్బంది దురహంకారం: ఈ అక్రమాలను ప్రశ్నించిన పేరెంట్స్ కమిటీ చైర్మన్ పై మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ సార్ తీవ్ర దురహంకారంతో విరుచుకుపడ్డారు. "మా ఇష్టం... ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి, స్కూల్ తనిఖీ చేసే అధికారం మీకెవరిచ్చారు? పేరెంట్స్ కమిటీ అయినా గేటు బయటే ఉండాలి" అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. బాధ్యతారాహిత్యంగా ప్రిన్సిపాల్: పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన పాఠశాల ప్రిన్సిపాల్ కూడా మెస్ ఇన్‌ఛార్జ్‌కే మద్దతు ఇస్తూ "మీరు తనిఖీ చేయడం కరెక్ట్ కాదు, అడగడానికి మీరెవరు?" అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం విచారకరం. కనీస సదుపాయాలు నిల్: పాఠశాలలో పిల్లలకు కనీసం తాగడానికి మంచినీటి సదుపాయం లేకపోవడమే కాకుండా, మరుగుదొడ్ల (టాయిలెట్స్) సరే లేక విద్యార్థులు బకెట్లతో నీళ్ళు పట్టుకుని అడవి బాట పడుతున్నారు. పేద కుటుంబాల పిల్లల ఆరోగ్యం భవిష్యత్తును నాశనం చేస్తూ, కనీస సదుపాయాలు కల్పించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ సార్‌ను, ఆయనకు సహకరిస్తున్న ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని జోనల్ ఆఫీసర్ (గ్రా) ములుగు జిల్లా సంక్షేమ అధికారి ( డి సి వో) ని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. లేని పక్షంలో తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# షూటింగ్‌లో తెలంగాణ పోలీసుల జోరు

- రాష్ట్ర, సౌత్‌జోన్ పోటీల్లో 15 పతకాలు..
6 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్యాలు





**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 15 (పీపుల్స్ న్యూస్)** షూటింగ్ క్రీడల్లో తెలంగాణ పోలీసు సిబ్బంది సత్తా చాటారు. రాష్ట్ర, సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో కలిపి 6 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 15 పతకాలు సాధించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో విజేతలను డీజీపీ సి.వి. ఆనంద్ అభినందించారు. క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ పోలీసు శాఖకు పేరు తీసుకురావడం అభినందనీయమని అన్నారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**రాష్ట్ర స్థాయి పోటీల్లో 11 పతకాలు**

12వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్--2026 జూన్ 20 నుంచి 28 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ, సాట్జ్ షూటింగ్ రేంజ్‌లో జరిగింది. రైఫిల్, పిస్టల్ విభాగాల్లో తెలంగాణ పోలీసు షూటర్లు 4 స్వర్ణాలు, 3 రజతాలు, 4 కాంస్య పతకాలు సాధించారు. 13వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన పీసీ 1304 జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణం, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రజతాలు సాధించారు. డీజీ టెక్నికల్ సర్వీసెస్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎ. ప్రసన్నకుమార్ 50 మీటర్ల పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో కాంస్య పతకం సాధించారు. ఫ్యూచర్‌సిటీలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు రజతం, కాంస్య పతకాలు సాధించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న వాసీ వి. సువర్ణ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో స్వర్ణం సాధించారు. సీఎస్‌డబ్ల్యు హైదరాబాద్ సీఐ బి. శంకర్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం సాధించారు.

**సౌత్‌జోన్‌లో 4 పతకాలు**

17వ సౌత్‌జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్--2026 ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 8 వరకు కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ పోటీల్లో తెలంగాణ పోలీసు షూటర్లు 2 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించారు. 13వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో రెండు స్వర్ణాలు, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్‌లో రజతం సాధించారు. ఫ్యూచర్‌సిటీ ఐటీ సెల్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన తెలంగాణ పోలీసు క్రీడాకారులను ఐజీ (పి & ఎల్) గజరావు భూపాల్, స్పోర్ట్స్ డీఎస్పీ రామారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

## సత్తుపల్లి ఏరియాలోని జియం కార్యాలయం లో సిఎంపీఫ్ త్రైపాక్షిక సమావేశము మరియు పెన్షన్ అదాలత్ సమావేశం



**ఖమ్మం సెప్టెంబర్ 15** సత్తుపల్లి ఏరియాలోని జియం కార్యాలయం లో సిఎంపీఫ్ త్రైపాక్షిక సమావేశము మరియు పెన్షన్ అదాలత్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఎం పిఎఫ్ కమిషనర్ వంశీధర్ కుటుంబ మరియు కనకమ్మ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్, సిరికొండ వెంకటాచారి పర్సనల్ మేనేజర్ ఎల్ తిరుపతి సిఎం పిఎఫ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి సులోచన, వెల్ఫేర్ అధికారులు మరియు రిటైర్ ఎంప్లాయిస్ పాల్గొని వారి సమస్యలను తెలియజేశారు వాటిని సిఎంపిఎఫ్ అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టూ జిఎం బొల్లం శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కిష్టారం ఓసీ, ప్రెసిడెంట్ సత్తుపల్లి ఏరియా ఏఐటీయుసి సుబేల్ వర్మ ప్రెస్టీడ్ బి రాజేశ్వరరావు పర్సనల్ మేనేజర్ యల్ తిరుపతి, యం మురళి, వెల్ఫేర్ ఆఫీసర్స్ దార కావ్య, కె. శ్రీనివాస్, ఏఐటీయుసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ సుధాకర్ మరియు వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

### సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



**సంగారెడ్డి సెప్టెంబర్ 15** ఇంజనీర్స్ డే సందర్భంగా సంగారెడ్డిలోని విద్యుత్ శాఖ కేంద్ర కార్యాలయంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) చంద్రశేఖర్, ఏడీఈ (ఆపరేషన్) సంగారెడ్డి లక్ష్మణ్, సదాశివపేట ఏడీఈ వీరారెడ్డి, ఏఏఓ సుధాకర్, ఏడీఈ (కమర్షియల్) లావణ్య, ఏఈలు ప్రశాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్ఖానా నుంచి బైసన్ పోలో గ్రౌండ్‌కు మర్రి చెట్టు తరలింపు

- వృక్ష సంరక్షణకు ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ చర్యలు







**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)** వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న కార్ఖానా లోని ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ కార్యాలయం ఎదుట ఉన్న భారీ మర్రి చెట్టును అధికారులు శాస్త్రీయ పద్ధతిలో తరలించి పునఃనాటారు. సంబంధిత శాఖల అనుమతులు పొందిన అనంతరం మల్కాజిగిరి కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. చెట్టుకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకుని బైసన్ పోలో గ్రౌండ్‌కు తరలించి పునఃనాటారు. చెట్టు ఆరోగ్యంగా పెరిగేలా నీటి సరఫరా, నిరంతర పర్యవేక్షణతో పాటు తదుపరి సంరక్షణ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పెద్ద చెట్లను తొలగించకుండా అనువైన ప్రాంతానికి తరలించడం ద్వారా పచ్చదనాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చామని ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## పంతాలకు పోవద్దు..

# పదోన్నతులు కోల్పోవద్దు




- డీఎస్పీలకు డీజీపీ సి.వి. ఆనంద్ సూచన
- పదోన్నతుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా



**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 15 (పీపుల్స్ న్యూస్)**
పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డీజీపీ సి.వి. ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తగా ఆయా బ్యాచ్‌లకు చెందిన 37 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో కొంతకాలంగా పదోన్నతుల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో డీజీపీ సి.వి. ఆనంద్ చొరవ తీసుకుని డీజీపీ కార్యాలయంలో ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కోర్టు కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు అధికారులకు వారం రోజుల సమయం ఇచ్చారు.కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని డీజీపీ వివరించారు. కేసులు వేసుకుని నష్టపోవద్దని, అధికారుల సమస్య పరిష్కారానికి తాను ముందుంటానని తెలిపారు. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించేందుకు అవకాశం ఉంటుందని




పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీలకు పదోన్నతులు కల్పించే చర్యలు చేపడతామని తెలిపారు.

**కేసుల ఉపసంహరణకు సుముఖత**
డీజీపీతో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డీజీపీకి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన ఆయా బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు.దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డీజీపీ సి.వి. ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# 8 కిలోల గంజాయితో అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్

- రూ.4 లక్షల విలువైన గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 15 (పీపుల్స్ న్యూస్)**
హైదరాబాద్ నగరంలో గంజాయి విక్రయించేందుకు తరలిస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని షంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఆర్జీఐఏ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 8 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్ విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన రాజ్ ప్రధాన్ అలియాస్ గౌరా (22) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన రామ్ బ్రాడా అలియాస్ బొలారామ్ అలియాస్ రామ్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.ప్రతి రెండు కిలోల గంజాయి ప్యాకెట్‌ను రూ.8 వేల చొప్పున కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో అవసరమైన వారికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయించేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు షంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి దర్యాప్తు నిమిత్తం ఆర్జీఐఏ పోలీసులకు




అప్పగించారు.ఈ ఘటనపై ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 815/2026గా కేసు నమోదు చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి) రెడ్‌విత్ 20బీ(ఊఊ)(దీ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి సరఫరాదారుగా పేర్కొన్న రామ్ బ్రాడా ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి**
యువత, విద్యార్థులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పోలీసులు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలని కోరారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ ఆపరేషన్‌లో షంషాబాద్ జోన్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణమోహన్, ఎస్‌ఐలు ఎస్. శేషు, కే. మన్సూర్ అలీ, ఎన్. నరసింగరావుతో పాటు షంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఆర్జీఐఏ పోలీసులు పాల్గొన్నారు.

## మధిర వాస్తవ్యులు బూరెలా మల్లికార్జున రావు 6వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం



**మధిర సెప్టెంబర్ 15**
వారి సతీమణి బూరెలా రుక్మిణి మరియు వారి కుమార్తెలు రూపావతి , రాజేశ్వరి , నాగమణి మరియు శైలజ ఈరోజు మధిర లోని మదర్ థెరిస్సా సేవాసదనము మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రము నందు అన్న వితరణ చేసినారు. బూరెలా మల్లికార్జున రావు పవిత్ర ఆత్మకు విశ్రాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఆదరణ ఓదార్పును ఇవ్వాలని కోరుకుంటూ మానసిక దివ్యాంగ పిల్లల తరపున దేవుని ప్రార్థిస్తున్నాము. బూరెలా మల్లికార్జున రావు మీకు దూరమైన సంవత్సరాలు గడిచిన వారి ప్రేమ వారి ఆలోచనలు ఆశీస్సులు మీతో మీ కుటుంబ సభ్యులు అందరితో ఉంటాయి, మల్లికార్జున రావు ని స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థం మానసిక దివ్యాంగ పిల్లలతో పంచుకుంటూ వారికి అన్న వితరణ చేసినందుకు రుక్మిణి మీకు మీ కుటుంబ సభ్యులకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతలు. మదర్ థెరిస్సా సేవాసదనము మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రము,మధిర. 8328226423 9000328300

# బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్..

- రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం...
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్...



**మెదక్ సెప్టెంబర్ 15**
ఎల్దుర్తి మండలం హక్కింపేట గ్రామ పరిధిలోని హక్కింపేట డ్యామ్ సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో దేవసోత్ దశరథ్, మల్గారెడ్డి నవీన్‌రెడ్డి, ఎండీ హుస్సేన్, దొడ్డ వినోద్, మల్లబోయిన గణేష్, పాశం మాణిక్‌రెడ్డి, గాండ్ల రాజు ఉన్నారు. వారి నుంచి రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.జిల్లాలో జూదం, బొమ్మా బొరుసు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ జూదం, బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

# సంగారెడ్డిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### పలు మండపాల్లో పూజల్లో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

**సంగారెడ్డి సెప్టెంబర్ 15**
వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పలు వినాయక మండపాల్లో నిర్వహించిన తొలి రోజు పూజల్లో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రామ్‌నగర్‌లోని రామ్ మందిర్ వద్ద భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణవాడ నుంచి తీసుకొచ్చిన మట్టి గణపతి విగ్రహాన్ని మండపంలో ప్రతిష్ఠించారు.గంజి మైదాన్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో జయారెడ్డి, గుణ చైతన్య రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. రామ్ మందిర్ యువసేన, చైతన్య యువజన సంఘం, ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మండపాల్లోనూ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భరత్ సాయి రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భరత్ సాయి రెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ తొలి రోజు పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి సంగారెడ్డి ప్రజలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# ఆదివాసీ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం




**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 15**

నేడు ఉట్నూర్ లో నిర్వహించనున్న ఛలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్ కు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలి రావాలని ఆదివాసీ తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు జూగునాక సూర్ పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఛలో ఐటీడీఏ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 1/70 గిరిజన చట్టాన్ని రద్దు చేయాలని, లంబాడాలను ఎస్టీ హోదాను నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్య నేటికి పరిష్కారానికి నోచుకోవడం లేదని మండిపడ్డారు. గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని వాపోయారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలోనే ఆదివాసీలు దేశానికి మూల వాసులని పొగడటం ఆ తర్వాత ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తలమల నుంచి లక్షెట్టిపేటకు రావడానికి రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదని, వర్షానికి బురదలో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ప్రభుత్వం తమ న్యాయమైన హక్కులను నెరవేర్చడం లేదన్నారు.ఆదివాసీలు ఛలో ఐటీడీఏ ఉట్నూర్ ద్వారా ప్రభుత్వానికి తమ గళాన్ని వినిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు మెస్రం చిత్రు,వర్కింగ్ ప్రెసిడెంట్ బద్ది చిన్నయ్య,నాయకులు బద్ది ధర్మయ్య, జూగునాక జగన్, బద్ది చంటి, కుర్సెంగా విజయ్ కుమార్, పూసం సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ విభాగం పనితీరుపై సీపీ సమీక్ష









**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి వార్షిక తనిఖీల్లో భాగంగా డీసీపీ ట్రాఫిక్--×× కార్యాలయాన్ని తనిఖీ చేసి, ట్రాఫిక్ విభాగం పనితీరు, నిర్వహణ, సిబ్బంది సన్నద్ధతను సమీక్షించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణకు చేపడుతున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అమలు చేస్తున్న నిబంధనలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయడంతో పాటు నిబంధనల అమలు, రహదారి భద్రత, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అవసరమైన సూచనలు, ఆదేశాలను సీపీ బి. సుమతి జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్--××, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీతో పాటు జోన్--×× పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు చేసిన కృషికి నిలువెత్తు నిదర్శనం

## - అన్నాచెల్లెళ్లకు, ఘన సన్మానం

**మంచిర్యాల సెప్టెంబర్ 15**





మంచిర్యాలలోని నివాసం ఉన్నటు కష్టాలను లెక్కచేయకుండా, పిల్లల చదువే తమ భవిష్యత్తు అని భావించి తల్లిదండ్రులు చేసిన కృషికి నిలువెత్తు నిదర్శనంగా గుజ్జేటి నగేష్--సుజాత దంపతుల పిల్లలు జి . అభిలాష్, జి . శ్రీనిధి నిలిచారు. మరో ప్రాంతం నుంచి మంచిర్యాలకు వచ్చి జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇచ్చింది. తండ్రి నగేష్ మిర్చిబండి నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ, పిల్లల ఉన్నత విద్య కోసం ఎంతో శ్రమించారు.వారి కష్టానికి ప్రతిఫలంగా కుమారుడు జి . అభిలాష్ ఎం బి బి ఎస్ 4వ సంవత్సరంలోకి ప్రవేశించగా, కుమార్తె జి . శ్రీనిధి ఈ ఏడాది ఎం బి బి ఎస్ లో చేరబోతోంది. ఈ సందర్భంగా నవోదయ టీం సభ్యులు, స్నేహితులు అభిలాష్, శ్రీనిధిలను పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పిల్లల విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులు నగేష్--సుజాత దంపతులను కూడా శాలువాలతో సత్కరించి అభినందించారు.

“లికష్టపడి పనిచేసే తల్లిదండ్రులు, చదువుపై పట్టుదల ఉన్న పిల్లలు కలిస్తే ఆర్థిక పరిస్థితులు విజయానికి అడ్డుకావు” అని ఈ కుటుంబం నిరూపించిందని నవోదయ టీం సభ్యులు పేర్కొన్నారు. మిర్చిబండి నడుపుతూ పిల్లల భవిష్యత్తు కోసం తండ్రి చేసిన కష్టం, పిల్లల పట్టుదల కలిసి సాధించిన ఈ విజయం ఎంతోమంది మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, బంధువులు,స్నేహితులు తదితరులు పాల్గున్నారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

- **షామీర్‌పేట్ చెరువును పరిశీలించిన పోలీస్, రెవెన్యూ అధికారులు**






**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**

రానున్న వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా డీసీపీ ట్రాఫిక్--1 కె. రాహుల్ రెడ్డి, డీసీపీ మల్కాజిగిరి చ. శ్రీధర్, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో పాటు వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు షామీర్‌పేట్ చెరువును పరిశీలించారు.

నిమజ్జన ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను అధికారులు సమీక్షించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పోలీస్ బందోబస్తును పటిష్టం చేయాలని, నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలను సక్రమంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వినాయక నిమజ్జనం సజావుగా, సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

# సంగారెడ్డిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు.

## పలు మండపాల్లో పూజల్లో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు.

**సంగారెడ్డి సెప్టెంబర్ 15**







వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పలు వినాయక మండపాల్లో నిర్వహించిన తొలి రోజు పూజల్లో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లోని రామ్ మందిర్ వద్ద భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన చేస్తూ ఊరేగింపులో పాల్గొ న్నారు. అనంతరం బ్రాహ్మణవాడ నుంచి తీసుకొచ్చిన మట్టి గణపతి విగ్రహాన్ని మండపంలో ప్రతిష్ఠి ంచారు.గంజి మైదాన్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండ పంలో జయారెడ్డి, గుణ చైతన్య రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. రామ్ మందిర్ యువ సేన, చైతన్య యువజన సంఘం, ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మండపాల్లోనూ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భరత్ సాయి రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భరత్ సాయి రెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ తొలి రోజు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి సంగారెడ్డి ప్రజలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# రెండు పడవలపై రాజకీయ ప్రయాణం.. పార్టీకి లాభమా? నష్టమా?

- **జన్నారం మండల రాజకీయాల్లో పెరుగుతున్న చర్చ..**

**నాయకత్వం పునరాలోచించాల్సిన సమయం**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 15**

జన్నారం మండల రాజకీయాల్లో కొందరు నాయకుల వ్యవహారశైలిపై పార్టీ కేడర్‌లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఒకవైపు పార్టీ ఇన్‌చార్జ్‌కు అత్యంత సన్నిహితులుగా కనిపిస్తూ.. మరోవైపు ప్రత్యామ్నాయ వర్గాలతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అసలు వీరి రాజకీయ విధేయత ఎటువైపు? పార్టీ బలోపేతమే లక్ష్యమా.. లేక వ్యక్తిగత రాజకీయ సమీకరణాలే ప్రధానమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పార్టీలోకి కొత్త నాయకులను చేర్చుకునే సమయంలో కేవలం వ్యక్తిగత పరిచయాలు, హామీలు, ప్రభావం పేరుతో నిర్ణయాలు తీసుకోవడం కంటే.. వారి గత రాజకీయ చరిత్ర, ప్రజల్లో ఉన్న ఆదరణ, గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి అందించిన సహకారం, గ్రామస్థాయిలో వారి వాస్తవ బలం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు సూచిస్తున్నారు.“మా వెంట ఇన్ని ఓట్లు ఉనా ్నయి.. మా గ్రామంలో అంత బలం ఉంది” అంటూ చెప్పుకునే నాయకుల మాటలను మాత్రమే నమ్మితే పార్టీకి వాస్తవంగా ఎంత ప్రయోజనం కలుగుతుందనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎన్ని ఓట్లు సాధించి పెట్టారు? పార్టీ కోసం ఎంత సమయం కేటాయించా రు? కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచారా? అనే అంశాలపై స్పష్టమైన అంచనా లేకుండా పదవులు, ప్రాధాన్యతలు కల్పిస్తే పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కేడర్ అభిప్రాయపడుతోంది.అంతేకాకుండా, గతంలో వివిధ వివాదాలు, కేసులు లేదా పార్టీ వ్యతిరేక కార్యకలాపాల




ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులను పార్టీలోకి ఆహ్వానించే ముందు వారి నేపథ్యాన్ని పూర్తిగా పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది. పార్టీకి నిజంగా ఉపయోగపడే వారిని గుర్తించకుండా కేవలం తమకు అనుకూలంగా ఉంటారనే కారణంతో కొందరికి అధిక ప్రాధాన్యత ఇస్తే.. అది పార్టీ బలానికి కాకుండా అంతర్గత విభేదాలకు దారితీస్తుందని పలువురు కార్యకర్తలు అంటున్నారు.

అవసరానికి అనుగుణంగా వర్గాలు మార్చుకుంటూ రాజకీయంగా లబ్ధి పొందే నాయకులకు మరోవైపు ప్రాధాన్యత లభిస్తే కష్టపడి పనిచేసే కేడర్‌లో నిరుత్సాహం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పార్టీ నాయకత్వం వ్యక్తుల మాటలకంటే వారి పనితీరును, ప్రజల్లోని వాస్తవ బలాన్ని, ఎన్నికల సమయంలో చేసిన కృషిని ప్రామాణికంగా తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. వ్యక్తిగత సంబంధాలు రాజకీయాల్లో సహజమే అయినప్పటికీ.. పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై నాయకత్వం స్పష్టమైన వైఖరి అవలంబించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.వ్యక్తుల చుట్టూ పార్టీ రాజకీయాలు తిరగకూడదు.. పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, ప్రజా బలం చుట్టూనే రాజకీయ నిర్ణయాలు ఉండాలి. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, నిజాయితీగా పనిచేసే వారికి అవకాశాలు కల్పిస్తేనే పార్టీ భవిష్యత్తు బలోపేతం అవుతుందని కేడర్ అభిప్రాయపడుతోంది.ఇప్పటికైనా పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయి వాస్తవాలను అంచనా వేసి, ఎవరు నిజంగా పార్టీ కోసం పనిచేస్తున్నారు? ఎవరు కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం దగ్గరవుతున్నారు? అనే అంశాలపై స్పష్టమైన సమీక్ష నిర్వహిస్తుందా? లేక రెండు వర్గాలతో సన్నిహితంగా ఉండే రాజకీయాలకు కొనసాగింపు ఇస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.

# కమలానగర్ బస్తీ ఎన్నికలపై సమావేశం.



**జూబ్లీహిల్స్ : సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)** రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ బస్తీలో బస్తీ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని బస్తీవాసులు కోరుతున్నారు. ఈ మేరకు బస్తీకి చెందిన పలువురు స్థానికులు సమావేశమై బస్తీలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. గత 14 సంవత్సరాలుగా బస్తీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీ నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధ్యక్ష ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉన్నప్పటికీ, దాదాపు 14 సంవత్సరాలుగా ఎన్నికలు జరగలేదని బస్తీవాసులు తెలిపారు. దీంతో ఇంతకాలంగా నాగరాజు అనే వ్యక్తే బస్తీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల బస్తీకి ప్రజాస్వామ్యబద్ధమైన ప్రాతినిధ్యం లేకుండా పోయిందని, దీనివల్ల బస్తీలోని మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లే పరిస్థితి లేదని వారు అన్నారు. బస్తీలో అధ్యక్ష ఎన్నికలు జరగకపోవడంతో స్థానికుల సమస్యలను సమష్టిగా ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో సమన్వయం కొరవడుతోందని బస్తీవాసులు తెలిపారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కొత్త నాయకత్వం ఏర్పడితే బస్తీ సమస్యలను సంబంధిత శాఖల వద్ద ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేసే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల బస్తీ అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కమలానగర్ బస్తీవాసులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 14 సంవత్సరాలుగా బస్తీ అధ్యక్ష ఎన్నికలు జరగని విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సానుకూలంగా స్పందించి ఎన్నికల నిర్వహణ కోసం హామీ ఇచ్చినట్లు బస్తీవాసులు తెలిపారు. ఈ సమావేశంలో కమలానగర్ బస్తీ వాసులు యాదయ్య, అమర్, దుర్గాప్రసాద్, నరసింహులు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ శోభాయాత్రకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- బాలాపూర్ నుంచి తెలుగు తల్లి జంక్షన్ వరకు 19 కి.మీ. మార్గంలో ఉన్నతాధికారుల పరిశీలన
- నిమజ్జనం రోజున 20 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు: సీపీ సజ్జనర్



**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)** గణేష్ విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్ తెలిపారు. పోలీస్, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఆర్అండ్‌బీ తదితర శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం బాలాపూర్ నుంచి ప్రత్యేక బస్సు యాత్ర నిర్వహించి శోభాయాత్ర మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాలాపూర్ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అధికారులు శోభాయాత్ర మార్గంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. బాలాపూర్ నుంచి ప్రారంభమైన పరిశీలన









చంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, ఎం.జే. మార్కెట్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ వరకు సుమారు 19 కిలోమీటర్ల మేర కొనసాగింది. రాజేష్ మెడికల్ హాల్, గుల్జార్ హౌస్, ఎం.జే. మార్కెట్ జంక్షన్, తెలుగు తల్లి జంక్షన్ వద్ద అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ గణేష్ చతుర్థి సందర్భంగా నగర ప్రజలకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాలుగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, స్థానిక ఉత్సవ కమిటీలు పోలీస్, ప్రభుత్వ శాఖలకు సహకరిస్తున్నాయని అభినందించారు. నిమజ్జనం రోజున నగరవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 20 వేల మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడించారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనాన్ని సజావుగా నిర్వహించేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు, యాంటీ చైన్ స్నాచింగ్ బృందాలు, షీ టీమ్‌లను మోహరించనున్నట్లు సీపీ తెలిపారు. ప్రతి జోన్ పరిధిలోని విగ్రహాలు సకాలంలో నిమజ్జనానికి బయలుదేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉన్నందున మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. శోభాయాత్ర మార్గంలో విద్యుత్, రహదారులు, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం తదితర ఏర్పాట్లపై అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నిమజ్జనం రోజున జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ట్రాన్స్‌కో, ఆర్అండ్‌బీ, వాటర్ వర్క్స్, ఆర్టీఏ, వైద్య ఆరోగ్య శాఖ తదితర విభాగాల సీనియర్ అధికారులు ఉమ్మడి కమాండ్ కంట్రోల్ సెంటర్ టీజీఐసీసీసీలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందిన హైదరాబాద్ గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి. జోయల్ డేవిస్, డీసీపీలు ఖారె కిరణ్, ఎస్. శ్రీనివాస్, ఆర్. వెంకటేశ్వర్లు, కె. శిల్పావల్లి, రాహుల్ హెగ్డే, అవినాశ్ కుమార్, కాజల్ సింగ్, బి. రాజేశ్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే - సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు

హైకోర్టు తీర్పును సకాలంలో సవాలు చేయలేదన్న సుప్రీంకోర్టు తగిన సమయంలో దాఖలు చేయకపోవడంతో విచారణకు తీసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం పిటిషన్?ను డిస్మిస్ చేసింది. సికింద్రాబాద్ ప్రాంతంలో వివాదాస్పద భూమి ప్రైవేటు(శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్) వారికి చెందినదే అని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కేవియట్ దాఖలు చేసింది. ఈ భూమి వ్యవహారంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదైన సంగతి తెలిసిందే. లోతుకుంటలో 40 ఎకరాల భూవివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్?ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పిటిషన్?ను కొట్టివేసిందని పేర్కొన్న రంగనాథ్ సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అలాగే జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సర్వే ద్వారా లోతుకుంట భూమి హద్దులు, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయడపడతాయన్నారు. అలాగే లోతుకుంటలోని సర్వే నంబరు 1, 2లోని శాంతాశ్రీరాం బిల్డర్స్? లే ఔట్‌కు ప్రస్తుతం హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమికి మధ్య దూరం దాదాపు 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా హైకోర్టుకు విన్నవించింది. సర్వే నంబర్ 1, 2 కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. ఈ వివాదంపై ఇటు ప్రభుత్వం, అటు నిర్మాణ సంస్థ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించడంతో విచారణ జరిపిన సుప్రీంకోర్టు సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పిటిషన్?ను కొట్టివేసింది.

# మునగాల కొండల్ రావు డిగ్రీ కళాశాల నూతన ఎన్.సి.సి సీటీఓ గా అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగేందర్ బాధ్యతల స్వీకరణ



**దేవరకొండ 15సెప్టెంబర్ :** దేవరకొండలోని మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగేందర్ నూతన ఎన్.సి.సి సీటీఓ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఆయనను ఘనంగా అభినందించారు.?ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ... విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు మరియు సేవాభావాన్ని పెంపొందించడంలో ఎన్.సి.సి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, దేశ సేవ పట్ల అవగాహన కల్పించడంలో ఎన్.సి.సి శిక్షణ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నూతన సీటీఓగా బాధ్యతలు చేపట్టిన నాగేందర్ ఆధ్వర్యంలో కళాశాల ఎన్.సి.సి విభాగం మరింత చురుగ్గా ముందుకు సాగుతుందని, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, సీఓఈ జి. లింగారెడ్డి, ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొని నూతన సీటీఓ నాగేందర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# భూ భారతి రీ--సర్వే అభ్యంతరాలపై విచారణ

---జిల్లా అదనపు కలెక్టర్ నగేష్..



**మెదక్ సెప్టెంబర్ 15**

భూ భారతి రీ--సర్వే ప్రక్రియలో భాగంగా మెదక్ మండలం పాశాపూర్ గ్రామంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పరిశీలన నిర్వహించారు. గ్రామంలో రీ--సర్వేకు సంబంధించి రైతులు దాఖలు పాషాపూర్ కు సంబంధించి 32 అభ్యంతర పిటిషన్లను, నర్సాపూర్ కు సంబంధించి రెహమతుల్లా గ్రామానికి సంబంధించి 01 అభ్యంతరాన్ని పరిశీలించి, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యంతర పిటిషన్లపై రైతుల సమక్షంలో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత రికార్డులు, భూముల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించి, అభ్యంతర దరఖాస్తులను నిర్ణీత ప్రక్రియ మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూ భారతి రీ--సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి అభ్యంతరాలను పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు

# యాదగిరిగుట్ట గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.



**యాదగిరిగుట్ట,**

తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని బుధవారం దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. తెల్లవారుజామున 5:30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి పాదాలకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలయ ఈవో భవాని శంకర్ ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మాధవాచార్యులు భార్గవాచార్యులు ఎస్పీఎఫ్ ఆర్ ఐ శేషగిరిరావు పిఏసిఎస్ చైర్మన్ చీర శ్రీశైలం గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ఎస్పీఎఫ్ సిబ్బంది మురళి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రహమత్ నగర్ 100 గజాల్లో ఐదు అంతస్తులు.

●పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు..

అధికారుల మౌనం.

●గాల్లో కార్మికుల ప్రాణాలు..!





**జూబ్లీహిల్స్ : సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**
యూసఫ్‌గూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ వాటిని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా రహమత్‌నగర్‌లో కేవలం 100 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఐదు అంతస్తుల కమర్షియల్ భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**తెలిసినా ఎందుకు చర్యలు లేవు?**
ఒకవైపు అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయం టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి తెలిసినప్పటికీ పనులను నిలిపివేయడం, నోటీసులు జారీ చేయడం లేదా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నిర్మాణం ప్రారంభ దశలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. లేకపోతే భవనం పూర్తయిన అనంతరం దానిపై చర్యలు తీసుకోవడం అనేది మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది . జరుగుతున్న నిర్మాణానికి సంబంధించిన భవన అనుమతులు, నిర్మాణ ప్లాన్, సెట్‌బ్యాక్‌లు, ఎలాంటివి లేకుండానే నిర్మాణదారుడు నిర్భయంగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మౌనం వహిస్తే నిబంధనలను ఉల్లంఘించే వారికి మరింత ధైర్యం వస్తుంది. అందుకే ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలు పునరావృతం కాకుండా కఠినమైన పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు అధికారులకు గుర్తు చేస్తున్నారు.

**భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలకు భద్రతేదీ?**
అక్రమ నిర్మాణాలు పెరుగుతున్న కొద్దీ భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువవుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మూడు, నాలుగు అంతస్తుల ఎత్తులో ఎలాంటి భద్రతా పరికరాలు, సేఫ్టీ బెల్టు, హెల్మెట్లు, రక్షణ వలలు లేకుండానే కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేస్తున్నారు. భవన నిర్మాణం కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికుల భద్రతపై సంబంధిత అధికారులు, నిర్మాణ యజమానులు వారి ప్రాణాలను గాలికి వదిలేస్తున్నారు.ఎత్తైన భవనాలపై రక్షణ చర్యలు లేకుండా పనిచేస్తున్న సమయంలో ఒక్కసారి కాలు జారినా.. క్షణాల్లోనే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటన జరిగితే కార్మికుడి ప్రాణానికి బాధ్యత ఎవరిది? అధికారులు బాధ్యత తీసుకుంటారా? లేక భవన యజమాని బాధ్యత వహిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల శ్రీకృష్ణ నగర్‌లో ఇదే తరహాలో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటనను స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడం మాత్రమే కాదు.. వాటిలో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలను కాపాడటం కూడా అధికారుల బాధ్యతే. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మహేష్‌కుమార్ గౌడ్‌కు కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

-- టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో అభినందనలు



**బాలానగర్ సెప్టెంబర్ 16 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేయడంలో ఆయన చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజలకు పార్టీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో ఆయన నాయకత్వం కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీభవన్‌కు చేరుకుని మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చందర్‌రావు, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, అరవింద్‌కుమార్, సాహెబ్ సేహంషా, క్రాంతికుమార్, రాము, వెంకటేష్ యాదవ్, పాల్గన్‌రావు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళు పూర్తి చేసుకున్న మహేష్‌కుమార్ గౌడ్‌కు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# మార్గదర్శి తర్వాతే భర్త, పిల్లలని ఆ రోజే నిర్ణయించుకున్నాను : శైలజా కిరణ్



**హైదరాబాద్:** స్పష్టమైన లక్ష్యం దానిని సాధించేందుకు కావాల్సిన పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించగలమని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన 'ఏ కప్ ఆఫ్ కాఫీ విత్ సీఈఓ' కార్యక్రమానికి శైలజా కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వారినే జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకోవాలిఈ సందర్భంగా మార్గదర్శి సంస్థతో తనకు ఉన్న అనుబంధం, సంస్థలో తన ప్రయాణం ఎలా మొదలైందన్న విషయాలను శైలజా కిరణ్ పంచుకున్నారు. ఆడపిల్లలకు నచ్చిన రంగాల్లో రాణించే స్వేచ్ఛను ఇచ్చే వారినే, జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. లెక్కలంటే భయపడే తనను నమ్మి రామోజీరావు మార్గదర్శి ఎండీ బాధ్యతలను అప్పగించారని గుర్తు చేసుకున్నారు. అయితే వ్యాపారాన్ని ముందుకు తీసుకువెళ్లాలనే తపన, ఆసక్తే తనను ముందుకు నడిపాయని శైలజా కిరణ్ వెల్లడించారు.
మార్గదర్శి తర్వాతే భర్త, పిల్లలని ఆ రోజే నిర్ణయించుకున్నాను : శైలజా కిరణ్ (జుఎ దీప్త్రుతీఫ్)
"సమావేశంలో నా పక్కనే కూర్చున్న ఛైర్మన్ (రామోజీరావు) మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్‌గా మీ పేరు ప్రకటించబోతున్నానని చెప్పారు. అప్పుడు నా వయస్సు 27 సంవత్సరాలు. నా గుండె వేగంగా కొట్టుకుంది. నా జీవితంలో మార్గదర్శికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆ రోజే నిర్ణయించుకున్నాను. నా భర్త, పిల్లలు కూడా మార్గదర్శి తర్వాతే అని ఆ రోజే నిర్ణయించుకున్నాను. ఎందుకంటే నేను ప్రజల సొమ్మును నిర్వహిస్తున్నాను. దానికి పూర్తి జవాబుదారి నేనే. కాబట్టి ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉంటాను. ఇలా చెబుతున్నందుకు క్షమించాలి. మహిళలు ఎక్కువ పనులు చేయలేరని చాలా మంది వ్యక్తులు అనుకుంటారు. ఇంటి బాధ్యత విషయంలో మాత్రం మహిళలకు పూర్తి ఘనత ఇస్తారు. వాళ్లు మాత్రమే ఇంటిని చూడగలరని భావిస్తారు. వ్యాపారం మగవారికి మాత్రమేనని అనుకోవడం ఓ సంప్రదాయంగా వస్తోంది. కానీ ఇది మారుతోంది. మహిళలూ క్రీయాశీలపాత్ర పోషిస్తున్నారు. స్పష్టమైన లక్ష్యం, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించగలం" – శైలజా కిరణ్, మార్గదర్శి ఎండ

## 25 కిలోల వినాయకుడికి 108 బంగారు పుష్పాలతో పూజలు

ఎత్తైన విగ్రహాలను కొనుగోలు చేస్తూ నవరాత్రులు నిర్వహిస్తున్న మండపాలను చూస్తుంటాం. కానీ ఇక్కడ మాత్రం పర్యావరణ హితం కోసం మట్టి వినాయకుని పూజిస్తున్నారు. దీంతో పాటు 25 కిలోల వెండితో తయారు చేసిన వినాయకుని నిత్యాభిషేకాలు చేస్తూ భక్తి భావాన్ని చాటుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్?పల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వినాయక చవితి వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి నిత్య పూజలు చేస్తుంటారు. ఇలా గత 14 సంవత్సరాల నుంచి మట్టి గణపతిని పూజిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.కనుల పండువగా వినాయకుడి ఊరేగింపు మట్టి వినాయకుని ప్రతిష్ఠించిన నిర్వాహకులు నిత్య పూజల కోసం ప్రత్యేకంగా 25 కిలోల వెండితో వినాయకుడిని తయారు చేయించారు. గణపతితోపాటు మహాలక్ష్మి, సరస్వతి దేవి, శివలింగాలు కూడా వెండితో తయారు చేయించారు. వెండి ప్రతిమలను మేళ తాళాల మధ్య పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమం కనుల పండువగా సాగింది.మా సంఘంలో వినాయకుడి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నాం. పది ఏళ్లుగా మట్టి గణేశుడిని పూజిస్తున్నాం. ప్రతి రోజు పూజలు ఘనంగా నిర్వహిస్తున్నాం. ఇక్కడ కిలో పావు చక్కెర పోసి కోరికలు కోరుకుంటారు. నెరవేరాక 11 కిలోల చక్కెర దేవుడికి పోస్తారు. ఆ రోజు దాదాపుగా 5,000 మంది భక్తులు పాల్గొంటారు– రాము, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, మెట్ పల్లిబంగారు పుష్పాలతో పూజఅభిషేకాలు చేసిన అనంతరం 108 బంగారు పుష్పాలతో స్వామివారిని పూజిస్తూ ఆర్యవైశ్యులు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రతి ఏట తొమ్మిది రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ పూజలు అభిషేకాలు, భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడి వాతావరణ ఆధ్యాత్మికంగా మార్చేస్తాయి.మెట్?పల్లిలో జరిగే వినాయక నవరాత్రులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుతారు. 27 కిలోల వెండి వినాయకుడు, 21 తులాల లక్ష్మీ దేవి, 108 బంగారు పూలు, 21 క్వింటాళ్ల చక్కెరతో అభిషేకం చేస్తారీ

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ దిగ్బంధనానికి సిద్ధం

**ఈ నెల 18లోగా హామీలు అమలు చేయాలి.. లేకుంటే ఉద్యోగ సంఘాలు ఉద్యమానికి దిగాలి: కల్వకుంట్ల కవిత**







**హైదరాబాద్: సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**
మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్రేడ్‌మార్క్‌గా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు.ద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరితే ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని కవిత ఆరోపించారు. ఉద్యోగులు ముఖ్యమంత్రి బెదిరింపులకు భయపడే బానిసలు కాదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ, పెన్షన్లు, పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

**ఆరు డీఏలు బకాయి**
గత 32 నెలలుగా ఉద్యోగులకు ఆరు డీఏలు బకాయిలుగా ఉన్నాయని కవిత ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు అందాల్సిన కరవు భత్యాన్ని ప్రభుత్వం చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల పాత్ర కీలకమని, అలాంటి ఉద్యోగులను ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదన్నారు.

**టీచర్ల సమస్యలు పరిష్కరించాలి**
ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై కూడా కవిత తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడం లేదని ఆరోపించారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, డీఏ బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2003లో నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు.

**18లోగా హామీలు అమలు చేయాలి**
ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఈ నెల 18లోగా సమస్యలను పరిష్కరించాలని కవిత డిమాండ్ చేశారు. ఉద్యోగులకు కనీసం హెల్త్‌కార్డులు కూడా సక్రమంగా పనిచేయని పరిస్థితి ఉందని ఆరోపించారు. పోలీసు సిబ్బందికి రావాల్సిన ప్రయోజనాలను కూడా వెంటనే చెల్లించాలని కోరారు.రాష్ట్రంలోని 206 ఉద్యోగ సంఘాలు జేఏసీగా ఏర్పడి ప్రభుత్వం ముందుంచిన 37 డిమాండ్లలో చాలా వరకు ఆర్థిక భారం లేనివేనని కవిత పేర్కొన్నారు. 317 జీవో సహా పలు సమస్యలను ప్రభుత్వం సులభంగా పరిష్కరించగలిగినా పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఈ నెల 18లోగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యోగ సంఘాలు హైదరాబాద్ దిగ్బంధనానికి పిలుపునివ్వాలని కవిత కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పోరాటానికి తమ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ఉద్యోగ సంఘాలు ఒత్తిడికి తలొగ్గొద్దు**
ఉద్యోగులకు మేలు చేయాల్సిన కొన్ని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి వారికి నష్టం చేస్తున్నాయని టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కవిత ఆధ్వర్యంలో పోరాటం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు.ఆర్టీసీ ఉద్యోగులపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకుడు సంజీవ్ పేర్కొన్నారు. ఉద్యోగులతో ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారని, ఈ విధానంలో మార్పు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, టీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, కనిష్క మహేందర్ రెడ్డి, విద్యావేత్త ధరణి రాణి తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మబండ వినాయక భక్త బృందం వారి ఆధ్వర్యంలో..!



**ఎల్లమ్మ బండ 15 సెప్టెంబర్** 124 డివిజన్ లో వినాయక చవితి శుభసందర్భంగా ఎల్లమ్మబండ వినాయక భక్త బృందం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో నిర్వహించిన వినాయక చవితి పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అదేవిధంగా వినాయక చవితికి ప్రతి సంవత్సరం ఇరువైఒక్క కేజీల లడ్డును ఎల్లమ్మబండ వినాయక భక్త బృందం వారికి అందిస్తున్న ఎం.డి ఖలీల్ ను శాలువాతో సన్మానించి గౌరవించడం జరిగింది. కులమతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం వినాయకుని లడ్డు ప్రసాదాన్ని అందిస్తున్న ముస్లిం సోదరుడైన ఖలీల్ ను వెంకటేష్ గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, చిన్నోళ్ల శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, సంపత్, కటిక రవి, దుర్గేశ్, భవాని, శ్రీకాంత్, యాకయ్య, కృష్ణ, పృథ్వీ, రాము, రవీందర్, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు...

# గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి...

---జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**చేగుంట మెదక్ జిల్లా సెప్టెంబర్ 15**
గర్భిణీ స్త్రీలపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చేగుంటలోని పిహెచ్సి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యం ఎలా అందుతుంది అని అడిగి తెలుసుకున్నారు. రూములు, మెడికల్ స్టోర్ ను, డాక్టర్ల సమయపాలన హాజరు పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. నెలలు నిండుతున్న గర్భిణీలపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైరిస్కు కేసులను ఎలా పరిష్కరిస్తున్నారని, హైరిస్కు కేసుల విషయంలో జిల్లా ఆస్పత్రి నుంచి ట్యాగ్ చేయాలన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలి...

**●ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలి...**

**●మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి..**



**రామాయంపేట సెప్టెంబర్ 15**
రామాయంపేట మండలం అక్కన్నపేట మండలంలో ప్రీ ప్రైమరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలని, ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు మంగళవారం రోజున రామాయంపేట మండలం అక్కన్నపేట మండలంలో ప్రీ ప్రైమరీ , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా లేదా అని విద్యార్థులతొ పాటు క్లాస్ రూమ్ లో కూర్చుని టీచర్ బోధనను అలాగే విద్యార్థులు మన్నన చేసుకునే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆలయ సన్నిధిలో స్వాతి నక్షత్ర వేడుకలు.





**యాదగిరిగుట్ట,**
ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి నిత్య పూజల అనంతరం అష్టోత్తర శతఘటభి షేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో 108 కలశాలను వరుస క్రమంలో పేర్చి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాల లో మంత్రపూరితమైన జలంతో స్వామివారిని అభి షేకించారు. స్వామివారి అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్ ఆలయ ప్రధానఅర్చకులు స్థానాచార్యులు కాందూరి వెంకటాచార్యులు సురేంద్ర చార్యులు ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు వినయ్ కుమార్ చార్యులు అనిల్ కుమార్ చార్యులు ప్రణీత్ చార్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కమిటీకి సీపీ అభినందనలు

**- ఎన్నికైన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన సీపీ బి. సుమతి**







**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్కు నూతనంగా ఎన్నికైన సభ్యులను కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ అభినందించారు. నూతనంగా ఎన్నికైన బృందానికి సర్టిఫికెట్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు..నూతన కమిటీ తన పదవీకాలంలో విజయవంతంగా పనిచేస్తూ పోలీసు అధికారుల సంక్షేమం, సమన్వయం కోసం కృషి చేయాలని సీపీ ఆకాంక్షించారు. నూతన బృందానికి భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధించాలని బి. సుమతి శుభాకాంక్షలు తెలిపారు.

# వర్షాలు వస్తే బస్తీల్లో లోతట్టు ప్రాంతాలు భయం..భయం

**●నాలా నీటితో ముంపు ముప్పు.. ఇళ్లలోకి మురుగు నీరు**

**●ఏటా ఇదే పరిస్థితి.. ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం**

**● బ్లీచింగ్, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**



**బాలానగర్ సెప్టెంబర్ 16 ( పీపుల్స్ న్యూస్)**
వర్షం పడితే చాలు.. బేగంపేట, ప్రకాశం నగర్ పరిధిలోని పలు బస్తీల ప్రజలకు గుండెల్లో గుబులు మొదలవుతోంది. బేగంపేటలో వర్షం కురవకపోయినా కూకట్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, అమీర్‌పేట ప్రాంతాల్లో భారీ వర్షం కురిసిందంటే బేగంపేట పరిధిలోని నాలాల్లో నీటి ఉద్ధృతి ఒక్కసారిగా పెరిగి బస్తీలను ముంచెత్తుతున్న పరిస్థితి నెలకొంటోంది. దీంతో నాలా పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రతి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, బ్రాహ్మణవాడి, వడ్డెర బస్తీ, మాతాజీ నగర్‌తో పాటు ప్రకాశం నగర్ డివిజన్ పరిధిలోని అల్లంతోట బాయి, మయూరి మార్గ్, చికోటి గార్డెన్, ప్రకాశం నగర్ ఎక్స్‌టెన్షన్, శ్యాంలాల్ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో నాలా నీరు, వర్షపు నీరు రోడ్లపైకి చేరి ఇబ్బందులు సృష్టిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పలుచోట్ల నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**-- ప్రతి ఏటా ఇదే సమస్య.. పరిష్కారం ఎప్పుడు?**
ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే తరహా పరిస్థితులు పునరావృత మవుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులు మారుతున్నా నాలా పరివాహక ప్రాంతాల్లో నివసించే బస్తీ ప్రజల కష్టాలు మాత్రం మారడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాల్సిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని స్థానికులు అంటున్నారు. భారీ వర్షం కురిసిన తర్వాత హడావుడిగా సహాయక చర్యలు చేపట్టడం కంటే ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. ప్రకాశం నగర్ పరిధిలోని గుండ్ల నరసింహస్వామి ఆలయం గల్లీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే శ్యాంలాల్ బిల్డింగ్ జంక్షన్, గణపతి ఆలయం జంక్షన్ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీరు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

**-- ఓల్డ్ కస్టమ్స్ బస్తీకి ఏడాది పొడవునా సమస్యే......**
బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అమీర్‌పేట, కూకట్‌పల్లి నాలాల మధ్య ఉన్న ఈ బస్తీలో వర్షాకాలం, ఎండాకాలం అనే తేడా లేకుండా మురుగు నీరు చేరుతోందని వారు ఆరోపిస్తున్నారు. నాలా నీరు బస్తీలోకి రావడంతో అనేక ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచిపోతూ దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. నిల్వ నీటితో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తరచూ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**-- బ్లీచింగ్, దోమల నివారణ చర్యలు ఏవీ?**
బస్తీల్లో మురుగు నీరు నిలిచిపోతున్నప్పటికీ బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు పొగమందు పిచికారీ చేయడం వంటి చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ బస్తీల్లో పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలు తగిన స్థాయిలో కనిపించడం లేదని వారు పేర్కొంటున్నారు. వర్షపు నీరు, మురుగు నీరు కలిసే ప్రాంతాలను గుర్తించి తరచూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, నిల్వ నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

**-- రానున్న భారీవర్షం ముంపు ముప్పు నుంచి కాపాడాలి............**
ఇప్పటికైనా బేగంపేట, ప్రకాశం నగర్ డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక బస్తీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నాలాల్లో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న చెత్త, మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించడంతో పాటు అవసరమైన చోట నాలాల సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, నాలా నీరు ఇళ్లలోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ప్రతి వర్షానికి ముంపు ముప్పులోనే బస్తీ ప్రజలు జీవించాల్సిన పరిస్థితి కొనసాగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."వర్షం వచ్చిన ప్రతిసారీ భయంతో బతకాల్సిన పరిస్థితి లేకుండా నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని బేగంపేట, ప్రకాశం నగర్ పరిధిలోని బస్తీ ప్రజలు కోరుతున్నారు.

# వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**● మల్లికార్జున కాలనీ రోడ్ నంబర్ 4లో ముద్దం నర్సింహ యాదవ్ పర్యటన**

**● అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచన**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని మల్లికార్జున కాలనీ రోడ్ నంబర్ 4లో వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజలు ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో రోడ్డుపై నడిచే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఆయన స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడం వల్లే సమస్య తీవ్రతరమవుతోందని స్థానికులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు రోడ్డు నిర్మాణ పరిస్థితులను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ముద్దం నర్సింహ యాదవ్ సూచనల మేరకు సంబంధిత అధికారులు కూడా సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అవసరమైన కొలతలు తీసుకుని, సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలు ప్రతిసారీ వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. వర్షపు నీటి నిల్వ సమస్యతో పాటు డ్రైనేజీ, రహదారి పరిస్థితులను కూడా సమగ్రంగా పరిశీలించి అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, ప్రసాద్, ఓబుల్‌రెడ్డి, శ్రీశైలం, మనోహర్ యాదవ్, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి

- ఆరోగ్య కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జర్నలిస్టుల విజ్ఞప్తి
- సీనియర్ జర్నలిస్టు పొన్నాల గౌరీశంకర్....



**బాలానగర్ సెప్టెంబర్ 16 ( పీపుల్స్ న్యూస్)**
ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. విధి నిర్వహణలో నిరంతరం ప్రజల మధ్య తిరుగుతూ, ఎండా వానలను లెక్కచేయకుండా వార్తల సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేసి, వాటి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంను విజ్ఞప్తి చేస్తున్నారు.

**-- ఆరోగ్య భద్రత జర్నలిస్టుల హక్కు..........**
సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను జర్నలిస్టులు నిర్వర్తిస్తున్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అవినీతి ఆరోపణలు, సామాజిక సమస్యలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం. అయితే విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, నిరంతర ప్రయాణాలు, సమయపాలన లేకుండా పనిచేయాల్సిన పరిస్థితుల కారణంగా అనేక మంది జర్నలిస్టులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని వారు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అనారోగ్యానికి గురైన సమయంలో ఖరీదైన వైద్య ఖర్చులను భరించడం చాలామంది జర్నలిస్టులకు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పత్రికలు, స్థానిక పత్రికలు, వార్తా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత మరింత అవసరమని పేర్కొంటున్నారు.

**-- కుటుంబాలకు కూడా వైద్య భరోసా కల్పించాలి..........**
జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులు అందించడంతో పాటు, వారి కుటుంబ సభ్యులకు కూడా వర్తించే విధంగా ఆరోగ్య పథకాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి వస్తే జర్నలిస్టుల కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రమాదాలు, సాధారణ వైద్య పరీక్షలు తదితర సందర్భాల్లో ఆరోగ్య కార్డుల ద్వారా వైద్య సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**-- అర్హత విషయంలో స్పష్టమైన విధానం అవసరం.......**
రాష్ట్రంలో వృత్తి జర్నలిస్టులుగా పనిచేస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్ష లేకుండా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు. అర్హత కలిగిన జర్నలి స్టులను గుర్తించేందుకు సరళమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**-- ప్రజా ప్రభుత్వం చొరవ చూపాలని ఆకాంక్ష.........**
జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి, ఆరోగ్య భద్రత విషయంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటే అది జర్నలిస్టు సమాజానికి గొప్ప భరోసా కల్పిస్తుందని వారు అంటున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలను కూడా ప్రభుత్వం తన బాధ్యతగా పరిగణించాలని కోరుతున్నారు."జర్నలిస్టులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేసి, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. జర్నలిస్టుల కుటుంబాలకు కూడా వైద్య భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకోవాలి" అని జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. జర్నలిస్టు సంక్షేమం -- ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమేనని, ఆరోగ్య భద్రత కల్పించడం ద్వారా జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించాలి

- ఫతేనగర్‌లో ఎస్ఐఆర్‌పై బూత్ ఇన్‌చార్జిల ప్రత్యేక సమావేశం
- నోటీసులు అందుకున్న ప్రతి ఓటరును గుర్తించి, అవసరమైన పత్రాలతో ఓటు నమోదు చేయించాలి
- మాజీ పండాల సతీష్ గౌడ్ సూచన



**బాలానగర్ సెప్టెంబర్ 16 ( పీపుల్స్ న్యూస్)**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఓటర్లకు అందిన నోటీసులపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఫతేనగర్ డివిజన్‌లోని ఐదు బూత్‌ల ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ప్రతి ఓటరును గుర్తించి, వారికి అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సంబంధిత పత్రాలను సిద్ధం చేసుకుని పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో తమ ఓటు హక్కును కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలి అని ఆయన స్పష్టం చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు అని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా బూత్ ఇన్‌చార్జిలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలను సేకరించి, వారి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారులు, ఓటర్ల మధ్య సమన్వయం పెంచుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించాలని బూత్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, కొత్తగా అర్హత పొందిన వారి పేర్లు సైతం నిబంధనల ప్రకారం నమోదు అయ్యేలా ప్రతి బూత్ పరిధిలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పిలుపు నిచ్చారు. ఇందుకోసం నోటీసులు అందుకున్న వారి జాబితాలను సంబంధిత దరఖాస్తు పత్రాలతో పాటు బూత్ ఇన్‌చార్జిలకు అందజేశారు.

**-- ప్రధానంగా డివిజన్ పరిధిలో ఐదు బూత్‌లపై ప్రత్యేక దృష్టి....**
ఫతేనగర్ డివిజన్‌లోని ఐదు బూత్‌ల పరిధిలో ఓటర్లకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన సహాయాన్ని అందించేందుకు బూత్ ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి ఓటరును సంప్రదించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఐదు బూత్‌ల స్థాయి ఇన్‌చార్జిలతో పాటు మాజీ అధ్యక్షులు కంచి భిక్షపతి, తూము జగదీష్, డేవిడ్, అన్వర్, జావేద్, నాగేష్, మల్లేష్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

**బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం చేపడుతున్న యాత్రకు అన్ని వర్గాలు మద్దతివ్వాలి**



**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సెప్టెంబర్ 15** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని షాద్‌నగర్ నియోజకవర్గ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.షాద్‌నగర్ పట్టణంలో నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీతో పాటు బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న చేపడుతున్న మహా పాదయాత్రకు షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు, వివిధ కుల సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ పాదయాత్రను విజయవంతం చేయడం ద్వారా బడుగు, బలహీన వర్గాల ఆకాంక్షలకు బలమైన మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.టీఆర్‌పీ జిల్లా అధికార ప్రతినిధి భూస జంగన్న మాట్లాడుతూ,, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు అనేక విధాలుగా అణచివేతకు గురైన పీడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తీన్మార్ మల్లన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. బహుజన వర్గాల హక్కులు, రాజ్యాధికారం కోసం సాగుతున్న ఈ ఉద్యమానికి అన్ని బహుజన వర్గాలు మద్దతు ప్రకటించాలని కోరారు. సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి ప్రారంభమయ్యే మహా పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తాలూకా ఉపాధ్యక్షులు మీదికేరి రాధాకృష్ణ,కొందుర్గు మండల అధ్యక్షులు దర్గా వెంకటేష్, కాశ యాదయ్యతో పాటు టీఆర్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు.

**జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్....**



**మెదక్ సెప్టెంబర్ 15**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి నెలకొనాలని కోరుకున్నారు.మెదక్ జిల్లాలో ప్రజలు పరస్పర సోదరభావం, ఐక్యతతో పం డుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, యువత పోలీ స్ శాఖ సూచనలను పాటిస్తూ భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవరాత్రుల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని ఎస్పీ సూచించారు. భక్తిశ్రద్ధలతో, సామరస్యపూర్వకంగా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# 45 ఏళ్ల క్రితం... ఉజ్జయినిలోని ఓ చిన్న స్వర్ణకారుడి దుకాణంలో ఓ యువతి బంగారు హారం కొట్టేసి... క్షణాల్లో మాయమైంది.



పోలీసులు ఎంత వెతికినా ఆచూకీ లేదు.ఆమె ఎవరు? ఎక్కడికి వెళ్లింది? ఎలా అదృశ్యమైంది? సమాధానం లేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి.కాలం గడిచిపోయింది.ఆ యువతి తన పేరును మార్చుకుంది... తన గతాన్ని పాతిపెట్టింది...45 ఏళ్ల పాటు ఎవరికీ అనుమానం రాకుండా మరో వ్యక్తిలా జీవించింది.అంతా ముగిసిపోయిందని ఆమె అనుకుంది.కానీ... 2026లో ఒక ౼ా× ఫొటో ఆమె జీవితాన్ని తలకిందులు చేసింది.80ల నాటి ట్రెండ్‌లో తనను తాను చూపించుకోవాలనే సరదాతో...౼ా×తో ఓ పాతకాలపు ఫొటోను తయారు చేయించుకుంది.ఆ ఫొటోను జ్ఞాపకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.అక్కడే కథలో అసలు ట్విస్ట్ మొదలైంది.ఆ ఫొటో ఎవరో ఒకరి కంటపడింది కాదు...45 ఏళ్ల క్రితం ఆ బంగారు హారం దొంగిలించబడిన దుకాణం యజమాని కంటపడింది.45 ఏళ్ల క్రితం తన దుకాణంలో కనిపించిన ఆ యువతి ముఖం...కాలం మార్చినా, పేరు మార్చినా...ఆ ఫొటోలో మాత్రం మళ్లీ అతని ముందుకొచ్చింది.పోలీసులు రంగంలోకి దిగారు.విచారణ మొదలైంది.45 ఏళ్లుగా మూసుకుపోయిన ఆ కేసు మళ్లీ తెరపైకి వచ్చింది.చివరకు...45 ఏళ్ల క్రితం జరిగిన ఆ దొంగతనాన్ని ఆమె ఒప్పుకుంది.ఎవరికీ తెలియకుండా దాచుకున్న గతాన్ని...ఆమె స్వయంగా సోషల్ మీడియాలో పెట్టుకున్న ఒక్క ఫొటో బయటపెట్టింది.కాలం కొన్ని రహస్యాలను మరచిపోతుంది...కానీ ఆధారాలను ఎప్పటికీ చంపదు.45 ఏళ్ల క్రితం దాచుకున్న ముఖం...2026లో ౼ా× సృష్టించిన ఓ ఫొటోలో తిరిగి కనిపించింది.80ల జ్ఞాపకాల్లోకి ఒక్కసారి తిరిగి వెళ్లాలనుకున్న ఆమెకు...ఆ ప్రయాణమే 45 ఏళ్ల రహస్యానికి ముగింపు పలికింది.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో 70 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

## 16 నుంచి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ




**యాదగిరిగుట్ట,సెప్టెంబర్ 15** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవల పద్ధతిలో భర్తీ చేయనున్న 24 విభాగాల్లోని 70 ఖాళీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీమ్ మెంబర్ సెక్రటరీ బి.శాంతిశ్రీ తెలిపారు.జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నెల 16 నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పని దినాల్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు యాదాద్రి భువనగిరి జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు నమూనాను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలోని తెలంగాణ ఎంప్లాయిమెంట్ అసిస్టెన్స్ మిషన్ (టీమ్), రూమ్ నంబర్ ఎఫ్8, మొదటి అంతస్తు, కలెక్టరేట్‌లో సమర్పించాలని సూచించారు.పోస్టుల వారీగా ఖాళీలు, విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ఆమె సూచించారు.

# సెప్టెంబర్ 17న శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం .. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, సెప్టెంబర్ 15:**
సెప్టెంబర్ 17న ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్ర పటానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఛాంపియన్ జ్వెరెవ్



## కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వశం
## ఫైనల్లో బెన్ షెల్టన్‌పై ఘన విజయం
## యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2026

**న్యూయార్క్ (యుఎస్ఏ) :** యుఎస్ ఓపెన్‌కు కొత్త ఛాంపియన్. మహిళల సింగిల్స్‌లో ఎలెనా రిబకినా తొలిసారి ఛాంపియన్‌గా అవతరించగా, పురుషుల సింగిల్స్‌లోనూ నయా చాంపియన్ వచ్చాడు. టాప్ సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అమెరికా ఆటగాడు, ఎనిమిదో సీడ్ బెన్ షెల్టన్‌పై అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-3, 7-6(7-2), 5-7, 6-2తో ఘన విజయం సాధించాడు. నాలుగు సెట్ల పోరులో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆరంభం నుంచి ఛాంపియన్ ఆటతీరు కనబరిచాడు. తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫైనల్‌కు చేరుకున్న బెన్ షెల్టన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన జ్వెరెవ్‌కు.. ఈ ఏడాదిలో ఇది రెండో విజయం. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ విజయంతో జ్వెరెవ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల ఖాతా తెరిచిన సంగతి తెలిసిందే. **జ్వెరెవ్ జయహో..** గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గని 'ప్రతిభావంతుడు'గా అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై టెన్నిస్ వర్గాల్లో ఓ ముద్ర పడింది. రోజర్ ఫెడరర్, రాఫెల్ నాదల్, నొవాక్ జకొవిచ్ త్రయం జోరులో పెద్దగా వెలుగులోకి రాని జ్వెరెవ్.. ఆ తర్వాత అల్కరాస్, సినర్ దూకుడుతో వెనుకంజ వేశాడు. ఈ ఏడాది ఏకంగా మూడు గ్రాండ్‌స్లామ్స్‌లో ఫైనల్‌కు చేరిన జ్వెరెవ్ రెండు టైటిల్స్‌తో సత్తా చాటాడు. గతంలో జ్వెరెవ్ మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరినా.. టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయాడు. ఆదివారం న్యూయార్క్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్లో జ్వెరెవ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. ప్రత్యర్థి తొలిసారి ఫైనలిస్ట్ కావటంతో.. జ్వెరెవ్ అనుభవంతో పాటు వరల్డ్ క్లాస్ ఆటతీరుతో పైచేయి సాధించాడు. తొలి సెట్లోనే బ్రేక్ సాధించిన జ్వెరెవ్ 6-3తో ముందంజ వేశాడు. రెండో సెట్లో షెల్టన్ నుంచి ప్రతిఘటన ఎదురైనా.. టైబ్రేకర్‌లో 7-2తో జ్వెరెవ్‌దే పైచేయిగా నిలిచింది. కీలక మూడో సెట్లో షెల్టన్ పుంజుకున్నాడు. జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి 7-5తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. కానీ నాల్గో సెట్లో మరోసారి పైచేయి సాధించిన జ్వెరెవ్ 6-2తో నాల్గో సెట్‌తో పాటు యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను ఎగరేసుకుపోయాడు. అలెగ్జాండర్ జ్వెరెవ్ 9 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించగా.. బెన్ షెల్టన్ 10 ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్‌తో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల పరంగా 125-113తో జ్వెరెవ్ ఆధిపత్యం చూపించాడు. జ్వెరెవ్ 24 గేములు గెలుపొందగా, షెల్టన్ 18 గేములే నెగ్గాడు. **ఛాంపియన్ భావోద్వేగం** యుఎస్ ఓపెన్ టైటిల్ సాధించిన అనంతరం అలెగ్జాండర్ జ్వెరెవ్ భావోద్వేగానికి లోనయ్యా డు. నాలుగేండ్ల వయసులోనే మధుమే హంతో బాధపడుతున్న తనని.. తన తల్లి ఏ విధంగా చాంపియన్‌గా తీర్చిదిద్దిందో జ్వెరెవ్ గుర్తు చేసుకున్నాడు. '4 ఏండ్ల కొడుకు డయాబెటిస్‌తో బాధపడుతున్నాడు. సాధారణ జీవితం, స్పోర్ట్స్ ఆ పిల్లవాడికి ఎంతో పరిమితమని వైద్యులు చెప్పారు. అయినా, నా కొడుకు టెన్నిస్ ప్లేయర్ కావాలని అనుకుంటే, టెన్నిస్ ప్లేయర్ అవుతాడు. జీవితంలో ఇంకేదైనా సాధించాలని అనుకుంటే అదీ సాధిస్తాడు అనే దీమాతో అమ్మ నన్ను పెంచింది. వెన్నంటి నిలిచి టెన్నిస్ ప్లేయర్‌గా, గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా నిలబెట్టింది' అని జ్వెరెవ్ కన్నీటి పర్యంతమవుతూ తన విజయంలో అమ్మ పాత్రను అభిమానులతో పంచుకున్నాడు.

# సిరీస్ మనదే



**3 వికెట్లతో మెరిసిన నితీశ్**
**అర్ధ సెంచరీతో చెలరేగిన సంజు**
**రెండో టీ20లో భారత్ ఘన విజయం**
**అఫ్గనిస్తాన్ 159/8, భారత్ 163/3**

**న్యూఢిల్లీ :** వరుసగా రెండో టీ20లో టీమ్ ఇండియా ఏకపక్ష విజయం నమోదు చేసింది. బంతితో, బ్యాట్‌తో ఎదురులేని ప్రదర్శన కనబరిచిన శ్రేయస్ సేన 7 వికెట్ల తేడాతో అఫ్గనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (57, 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అభిషేక్ శర్మ (39, 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (38 నాటౌట్, 23 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. 14.5 ఓవర్లలోనే 3 వికెట్లకు భారత్ 163 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (37, 33 బంతుల్లో 6 ఫోర్లు), రషీద్ ఖాన్ (28, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), దార్విశ్ రసూల్ (26, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), మహ్మద్ నబి (20, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అఫ్ఘాన్‌కు గౌరవప్రద స్కోరు అందించారు. భారత బౌలర్లలో పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (3/24) మూడు వికెట్లు పడగొట్టగా.. అర్ష్‌దీప్ సింగ్ (2/35), జశ్‌ప్రీత్ బుమ్రా (1/25), అక్షర్ పటేల్ (1/28), రవి బిష్ణోయ్ (1/32) రాణించారు. భారత్, అఫ్గనిస్తాన్ మూడో టీ20 గురువారం ఫిరోజ్ షా కోట్ల స్టేడియంలోనే జరుగనుంది.

# విజేత హైదరాబాద్ గ్లోబ్

**- సీసీఓబీ ఫుట్‌బాల్ కప్**



హైదరాబాద్ : సిటీకాలేజ్ ఓల్డ్ బాయ్స్ (సీసీఓబీ) ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీసీఓబీ కప్ (అండర్-21) విజేతగా హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో హైదరాబాద్ స్పోర్టింగ్ ఎఫ్‌సీపై 1-0తో హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ గెలుపొందింది. సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్ 55వ నిమిషంలో గెలుపు గోల్ అందించాడు. అంతకుముందు సెమీఫైనల్లో ఆతిథ్య సీసీఓబీపై 1-0తో, క్వార్టర్‌ఫైనల్లో సైదాబాద్ ఎఫ్‌సీపై 5-0తో హైదరాబాద్ గ్లోబ్ గెలుపొందింది. హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ జట్టును, కోచ్‌లు వహీద్ ఖాన్, సయ్యద్ ఓవైస్ ఉద్దీన్‌లను సీసీఓబీ క్లబ్ అధికారులు అభినందించారు.

# మెరిసిన శాంసన్, నితీశ్.. టీ20 సిరీస్ టీమిండియా వశం..!

మూడు టీ20ల సిరీస్‌లో జోరు చూపిస్తున్న భారత్.. వరసగా రెండో మ్యాచ్‌లోనూ అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో నితీశ్ రెడ్డి(3-35) బంతితో రాణించగా.. ఆపై ఓపెనర్లు అభిషేక్ శర్మ(39) సంజూ శాంసన్(57)లు దంచేశారు. అర్ధ శతకంతో విరుచుకుపడిన సంజూను రషీద్ ఖాన్ బోల్తా కొట్టించినా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్) సాయంతో ఇషాన్ కిషన్(38 నాటౌట్) లాంఛనం ముగించాడు. ఏడు వికెట్ల విజయంతో సిరీస్‌ను పట్టేసింది టీమిండియా.ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌ల నుంచి తేరుకున్న టీమిండియా స్వదేశంలో గర్జించింది. అఫ్గనిస్థాన్‌పై వరసగా రెండు విజయాలతో టీ20ల సిరీస్‌ను గెలుచుకుంది భారత్. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో నెగ్గిన అయ్యర్ సేన.. ఈసారి వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్లు అభిషేక్ శర్మ(39), సంజూ శాంసన్(57) మెరుపు ఆరంభమిచ్చారు. రెండు ఓవర్లలోనే నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 47 రన్స్ పిండుకుందీ ద్వయం.అభిషేక్ ఔటైనా.. తనమార్క్ షాట్లతో అలరించిన శాంసన్ అర్ధ శతకం బాదాడు. అయితే.. రషీద్ ఖాన్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించి సంజూ బౌండరీ వద్దనబీ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి రషీద్ ఓవర్లోనే శ్రేయాస్ అయ్యర్(11)ను డైవింగ్ స్లిప్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. ఇషాన్ కిషన్(38 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వలేదు. అప్పటికే విజయం ఖరారు కాగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేశాడు ఇషాన్. 15వ ఓవర్లో బౌండరీతో జట్టును గెలిపించాడీ చిచ్చరపిడుగు. 7 వికెట్లతో జయభేరి మోగించిన్ మెన్ ఇన్ బ్లూ మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ పట్టేసింది.



నామమాత్రమైన మూడో టీ20 సెప్టెంబర్ 17న జరుగనుంది. **నబీ, రషీద్ ధనాధన్** టాస్ ఓడిన అఫ్గనిస్థాన్‌కు మొదటి ఓవర్లోనే షాకిచ్చాడు అర్ష్‌దీప్ సింగ్. తొలి మ్యాచ్‌లో డకౌటైన ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్(0)ను అతడు సున్నాకే పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నితీశ్ రెడ్డి(3-35) ఓవర్లో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్(37)పెద్ద షాట్ ఆడి రవి బిష్ణోయ్ చేతికి చిక్కాడు. ధాటిగా ఆడుతున్న సెడీకుల్లా అటల్(12)ను రవి బిష్ణోయ్ ఔట్ చేయగా.. గుల్బదిన్(10), డార్విష్ రసూలీ(26)లు విఫలమయ్యారు.

# ఐజా మిర్‌కు పసిడి పతకం

**- హైదరాబాద్ హార్స్ షో ఫైనల్స్**



**హైదరాబాద్ :** హైదరాబాద్ హార్స్ షో ఫైనల్లో ఐజా మిర్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. అండర్-14 విభాగం 110-115సెమీ షో జంపింగ్ పోటీల్లో ఐజా మిర్ సత్తా చాటింది. ఈ విభాగంలో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సాధించిన ఐజా మిర్.. అండర్-14 విభాగం 100 సెమీ షో జంపింగ్‌లో నాల్గో స్థానంలో నిలిచింది. 25 మంది పోటీపడిన ఫైనల్లో ఐజా మిర్‌తో పాటు సెంతిల్, ఈశన్ భరద్వాద్, సంజయ్, ప్రభునూర్ సింగ్, వేదిక్, ఆమిర్, మిర్ నజముద్దీన్ ఆజామ్‌లు పతక ప్రదర్శనతో ఆకట్టుకున్నారు

## టెస్టుల్లో ఫ్లాప్.. వన్డేల్లో తొలి శతకంతో
# రెచ్చిపోయిన కుర్రాడు..!

మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం అదరకున్నా వన్డేల్లో మాత్రం దంచేశాడు మ్యాట్ రెన్‌షా. బంగ్లాదేశ్‌పై తీవ్రంగా నిరాశపరిచిన అతడు జింబాబ్వేపై చితక్కొట్టాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ కుర్రాడు శతకం బాదేశాడు. బ్రాడ్ ఎవాన్స్ ఓవర్లో సింగిల్ తీసిన అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌లో మొదటి సెంచరీ నమోదు చేశాడు.స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో విఫలమైన ఆస్ట్రేలియా కుర్రాడు మ్యాట్ రెన్‌షా వన్డేల్లో శతక్కొట్టాడు. మంగళవారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వే బౌలర్లను ఈ లెఫ్ట్ హ్యాండర్ ఉతికేశాడు. టాపార్డర్ విఫలమైనా వన్డేల్లో మొదటి సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. 107కే నాలుగు వికెట్లు పడిన వేళ.. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చి ధనాధన్ ఆటతో అలరించిన అతడు 94 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 109 రన్స్ సాధించాడు.ఆతిథ్య బౌలర్లను ఎడాపెడా ఉతికేస్తూ.. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి రెన్‌షా విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు రెన్‌షా. దాంతో, ఆసీస్ 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న ఆస్ట్రేలియాకు.. రెన్‌షా రూపంలో ఆరో స్థానంలో అదరగొట్టే బ్యాటర్ దొరికాడు.

బుధవారం, సెప్టెంబర్ 16, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
12

# 'మండాడి' జాక్‌పాట్..

## 5 రోజుల్లోనే రూ. 65 కోట్ల వసూళ్లు!




తెలుగు నటుడు సుహాస్, తమిళ నటుడు సూరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మండాడి'. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడుదలైన కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 65 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. ఈ చిత్రం సాధిస్తున్న ఘనవిజయం నిర్మాత ఎల్రెడ్ కుమార్‌కు భారీ లాభాలను తెచ్చిపెడుతోంది. సుమారు రూ. 45 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ కైవసం చేసుకుంది. అయితే, ఈ ఒప్పందం బాక్సాఫీస్ వసూళ్ల ఆధారంగా కుదరడం గమనార్హం. సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 50 కోట్లు దాటితే రూ. 30 కోట్లు, రూ. 60 కోట్లు దాటితే రూ. 40 కోట్లు చెల్లించేలా నెట్‌ఫ్లిక్స్ ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం 'మండాడి' వసూళ్లు రూ. 65 కోట్ల మార్కును అధిగమించడంతో, నిర్మాతకు నెట్‌ఫ్లిక్స్ నుంచి రూ. 40 కోట్లు అందనున్నాయి. థియేట్రికల్ వసూళ్లతో పాటు నాన్-థియేట్రికల్ హక్కుల ద్వారా కూడా నిర్మాతకు ఆశించిన దానికంటే ఎక్కువ లాభాలు వస్తున్నాయి. విభిన్నమైన కథాంశం, ఉత్కంఠ కలిగించే బోట్ రేసింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదే వేగం కొనసాగితే ఈ చిత్రం త్వరలోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఇద్దరం మంచి స్నేహితులం

## ఆనంద్ దేవరకొండతో రిలేషన్ లో ఉందనే వార్తలపై వైష్ణవి చైతన్య క్లారిటీ

టాలీవుడ్ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్యలు రిలేషన్ లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబి'తో పాటు 'ఎపిక్'లో కలిసి నటించిన ఈ జోడీ రీల్ లైఫ్ కెమిస్ట్రీ చూసి, వీరిద్దరూ రియల్ లైఫ్ లోనూ ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.

ఈ డేటింగ్ రూమర్లపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన వైష్ణవి చైతన్య, తమ మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని తేల్చి చెప్పింది. తామిద్దరం మంచి కో-స్టార్స్ మాత్రమే కాకుండా ఆత్మీయ స్నేహితులమని తెలిపింది. ఇదే సమయంలో ఆనంద్ దేవరకొండ పెళ్లి ప్రణాళికల గురించి మాట్లాడుతూ... రాబోయే మూడేళ్లలో వివాహం చేసుకుంటానని చెప్పాడు. అయితే తనకు మాత్రం ఇప్పట్లో వివాహం ఆలోచన లేదని, కేవలం సినిమాలపైనే దృష్టి సారిస్తానని వైష్ణవి స్పష్టం చేసింది.



# డేవిడ్ రెడ్డిలో రమ్యకృష్ణ ..

## ఫస్ట్‌లుక్‌తో అంచనాలు పెంచిన మేకర్స్



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న 'కమలా రెడ్డి' పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం.

పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు.

ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా 'క్లారా విట్‌మోర్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది. 'డేవిడ్ రెడ్డి'కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి. మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

# కెరీర్‌లోనే అత్యంత కీలక పాత్రలో రష్మిక..

## ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ ఖరారు

### నిర్మాతలుగా అల్లు అరవింద్, బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేశ్






స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును దక్కించుకున్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అధికారికంగా ఖరారైంది. 'ఎం.ఎస్. - ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటిగా రష్మిక కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవాన్ని రేపు (సెప్టెంబర్ 16న) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ కోరల్ ఎన్సెంబుల్ బృందం, సుబ్బులక్ష్మి ఆలపించిన కొన్ని అజరామర గీతాలతో సంగీత నివాళి అర్పించనుంది. 'జెర్సీ' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

టాలీవుడ్ అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాస్‌లతో కలిసి ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాత్ర కోసం చిత్రబృందం మొదట సాయి పల్లవి, రుక్మిణి వసంత్ వంటి నటీమణులను పరిశీలించింది. అయితే, ఇతర ప్రాజెక్టుల కారణంగా సాయి పల్లవి ఈ అవకాశం వదులుకున్నట్లు సమాచారం. అనంతరం నిర్వహించిన స్క్రీన్ టెస్టులో రష్మికను ఈ పాత్రకు ఎంపిక చేశారు. భారతరత్న పురస్కార గ్రహీత అయిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, కేవలం శాస్త్రీయ సంగీతానికే పరిమితం కాలేదు. ఆమె 'సేవాసదనం', 'శకుంతలై', 'సావిత్రి', 'మీరా' వంటి చిత్రాల్లో నటించి నటిగా కూడా తనదైన ముద్ర వేశారు. అలాంటి గొప్ప వ్యక్తి పాత్రను పోషించడం రష్మికకు నటిగా అతిపెద్ద సవాల్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక, రష్మిక నటిస్తున్న ఇతర సినిమాల విషయానికొస్తే.. యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నవంబర్ 27న విడుదల కానుండగా, విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆసక్తి రేపుతున్న 'అనుమాన పక్షి' ట్రైలర్




'డీజే టిల్లు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ మరో వినూత్న కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి'. టాలెంటెడ్ నటుడు రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ కథ మొత్తం హీరో పాత్రకున్న 'అనుమానం' అనే బలహీనత చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ప్రతి చిన్న విషయాన్ని అనుమానించే వ్యక్తిగా రాగ్ మయూర్ నటన, హావభావాలు నవ్వులు పూయిస్తున్నాయి. కేవలం కామెడీ మాత్రమే కాకుండా, క్రైమ్ థ్రిల్లర్, డార్క్ కామెడీ అంశాలను కూడా దర్శకుడు జోడించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన కథతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. 'డీజే టిల్లు' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ ఎలాంటి వినోదాన్ని అందిస్తారోనని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com